నాకు నచ్చిన నా కథ

దాదాపు 20 సంవత్సరాల క్రిందట।

అప్పుడు నాకు గ్లామర్, పేరు, ప్రతిష్ట అంటే ఏమిటో తెలియవు। నవలలు వ్రాయటం అస్సలు చాతకాదు। సరదాగా, ఎప్పుడో బుద్ధిపుట్టినప్పుడు, ఒక కథ వ్రాస్తూ వుండేదాన్ని। అది వ్రాసిన వెంటనే ఆంధ్రపత్రిక వారపత్రికకు పంపుతూ వుండేదాన్ని. ఇంకే పత్రిక అడ్రస్ నాకు తెలియదు. తెలుసుకోవాలనే కుతూహలమూ వుండేది కాదు. నేను పంపిన వెంటనే నా కథ ప్రచురితం అయేది. 'ఐ లవ్ యూ', 'నాకీ అదృష్టం చాలు', 'పెళ్లి ప్రయాణం', 'అమూల్య'. ఇవన్నీ అప్పుడు వ్రాసిన కథలే।

'అమూల్య' కథ పడినప్పుడు, ఆంధ్రపత్రిక యాజమాన్యంవారు నాకు రెండు ఉత్తరాలు పంపించారు. ఆ వ్రాసినవారి పేర్లు నాకు గుర్తులేవు. కానీ, ఆ రోజున నేను పొందిన ఆనందం మాత్రం యిప్పటికీ గుర్తుంది. నా కథ బాగుంది

అంటూ వచ్చిన ఆ ఉత్తరాలు చూడగానే, నేను కీర్తి కిరీటం ధరించిన మహారాణిలా గర్వపడ్డాను. హిమాలయాన్ని ఒంటరిగా జయించిన విజేతలా యీ లోకాన్ని చూసాను।

రచనా వ్యాసంగంలో ప్రతి పది సంవత్సరాలకీ కొత్త తరం వస్తుందీ అంటారు. ఈ కొత్త తరం ఒరవడిలో, కొన్ని నవలలు, కథలు, కాలం నీడ పడి, రూపులేకుండా – గుర్తింపులేకుండా మాసిపోతాయి. ఈ కథలు రెండు దశాబ్దాలు దాటినా ఇంకా పాఠకులకి, పబ్లిషర్స్‌కి అభిమాన కథలుగా వుండటం కేవలం నా అదృష్టం అనుకుంటాను.

ఈ రోజున —

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, జీవితంలో నేను ఎంతో ఎదిగాను అన్పిస్తుంది. ఈ రచనా వ్యాసంగమే నన్ను యింత ఎత్తుకి పెంచింది. నాకు ఈనాడు కారు, ఫోను, సెక్రటరీ, పేరు, ప్రతిష్ఠ, గ్లామరు, సాహిత్య ఎకాడమి బహుమతులు, నవలలు సినిమాగా వచ్చిన, శతదినోత్సవ సంరంభాల వేడుకలు, ఎన్నెన్నో నేను వూహించనివి, ఆశపడనివి, కలలు కననివి ఈ రచనా వ్యాసంగం నాకు ప్రసాదించింది. ఇది కేవలం పూర్వజన్మ పుణ్యమేమో అనిపిస్తుంది. నే నెక్కువ చదువుకోలేదు। అయినా మనుష్యుల్ని, జీవితాల్ని సులభంగా చదివే టెక్నిక్ నాకు అలవడింది। ఈ రోజున రచన అనేది నాకు ఒక సరదా కాదు। ప్రాణం పణంగా పెట్టి పనిచేయాల్సిన ప్రొఫెషన్। నా జీవితంలో మూడువంతులు పైగా అల్లుకుపోయింది। చుట్టాల్ని, స్నేహితుల్ని, చివరికి నా భర్తని, నా కూతురుని కూడా, తన తర్వాతనే నిలబడాలి అంటుంది.

ఇదంతా బాగానే వుంది।

ఒక్కసారి, ఈనాడు, ఇన్ని సంవత్సరాలలో, నేను వ్రాసిన కథల్లో నాకు నచ్చిన కథేమిటి అని పరిశీలించుకుంటే, 20 సంవత్సరాల క్రితం అనుభవం లేని, లేతవయసులో వ్రాసిన ఈ 'అమూల్య' కథే నాకు నచ్చుతోంది। ఎందుకంటే, నిష్పక్షపాతంగా చెప్పాలంటే, ఈ కథ వ్రాయటంలో ఒక అందమైన బావశైలి ఉంది. విషయం చెప్పటంలో ముగ్ధత్వం ఉంది। భాషలో నాజూకుతనం వుంది। రచనని నడిపే భావోద్వేగంలో నిజాయితీ వుంది. ఇప్పుడు నేను వ్రాసే కథల్లో – నవలల్లో యివి వున్నాయా? జీవితంలో ఎదగ గలిగిన నేను, రచనా వ్యాసంగంలో కూడా అంతగా ఎదగగలిగానా? ఆలోచనలో పడ్డాను నేను।

— యద్దనపూడి సులోచనారాణి

అ మూ ల్య

పెద్ద హాలు. హాలునిండా ఆడవాళ్ళు. హాలుకి మధ్యగా రంగురంగు దీపాలతో పూలగుత్తి అమర్చబడ్డ తోరణం. ఆ తోరణం నుంచి ప్రసరిస్తున్న రంగు రంగుల కాంతులు హాలుని ఇంద్రధనస్సులో ఉన్నట్లు చూపుతున్నాయి. హాలు నిండా వరసల ప్రకారం అమర్చివేసిన కుర్చీలు, వాటికి దూరంగా కుడివైపు గోడ వారగా కొన్ని బెంచీలు కలిపివేసి వాటిమీద తివాసీలు పరిచి తాత్కాలికంగా ఏర్పరచిన చిన స్టేజీ. స్టేజీమీద ప్రపంచం అంతా మునిగిపోయినట్లు మొహం ముడుచుకుని కూర్చున్న ఓ పసిమొహం. స్టేజీమీద హాలులో హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్న ఆడవాళ్ళలో ఆ చిన్నపాపని యెవరూ పట్టించుకున్నట్లు లేరు. చాలామంది వరుసగా వేసిన కుర్చీలని వదిలేసి చిన్న చిన్న గుంపులుగా చేరి యేవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇద్దరు, ముగ్గురు ఆంగ్లో ఇండియన్స్ గౌన్లు, భుజాలులేని గౌన్లతో ఓ పక్కగా కుర్చీలో కూర్చుని వచ్చే పోయే వారినీ హాలునీ స్టేజీమీదున్న పాపనీ కలయచూస్తున్నారు. కొంతమంది ఫలహారాలు వాటికి కౌంటర్లు ఎడంపైపుగా వున్న గది గుమ్మంలోంచి లోపలకు వెళ్ళి తిరిగి వస్తున్నారు. ఆ తిరిగివస్తున్నవారికి గుమ్మందగ్గర రక్షకభటుల్లా నిటారుగా నిలబడ్డ ఇద్దరు పొడుగాటి సన్నటి అమ్మాయిలు కిళ్ళీలు, ఏవో పేపరు పొట్లాలు అందిస్తున్నారు. అంతా ఆడవాళ్లే! ఒక్క మగపురుగు లేదు. కొంత మంది చిన్నపిల్లల్ని తప్పిస్తే మొత్తానికి హైదరాబాదులో అన్ని రకాల జాతులకు, కోవలకు చెందిన ఆడవాళ్ళందరూ దాదాపుగా ఇక్కడ కన్పిస్తూనే ఉన్నారు. యింతమంది ఆడవాళ్ళని ఒకచోట తన జీవితంలో ప్రప్రథమంగా చూస్తున్న వాసంతి ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసుకొని చూస్తోంది. ఒక్క తలలే చూస్తే ఎన్నిరకాలో - తట్టంత చుట్టలు చుట్టి వాటిమీద బుట్టెడు పూలు పెట్టినవాళ్ళు కొంతమంది అయితే, కొంతమంది అసలు జడే వేసుకోనట్లు భుజాల సగభాగందాకా వదిలేసి అక్కడ్నుంచి రెండల్లులు అల్లినట్లున్నారు. ఇంకా కొంతమంది పీచుల్లావున్న రెండు జడలు వేసుకున్నారు.

కొంతమంది చక్కగా పొడుగాటి జడలు వేసుకొని వాటిపైన నాగరం, చంద్రవంకలాంటివి పెట్టుకుని చివరలు కుప్పెలు వేసుకున్నారు. ఇంకా కొంత మంది నడినెత్తిమీదికి రిబ్బన్ పువ్వులా వచ్చేటట్లు అదేదో అజంతా బొమ్మల్లా ముడేసుకున్నారు. జుట్టుని ఎన్ని రకాల అలంకరించుకోవచ్చో వాసంతికి తెలిసి

పోయింది. ఒక్క జుట్టే కాదు. బట్టలు, బొట్టు, గాజులు యెంత నాజూకుగా, యెంత సహజంగా అలంకరించుకోవచ్చో వాసంతికి మొదటిసారిగా అర్థమైంది. జుట్టు, కట్టు, బొట్టు - ఈ మూడింటికోసం ఆడవాళ్ళు ఎన్నిరకాలు కావాలనుకుంటారో, ఎంత తాపత్రయపడతారో అన్పిస్తుంది. వీళ్ళని చూస్తుంటే ఎంతైనా పుట్టినరోజు ఇంత హడావుడా, చిన్న పెళ్ళిచేసినంత. పుట్టినరోజే ఇంత వైభవంగా చేస్తుంటే ఇహ పెళ్ళికి యెంత హడావుడి పడతారో! బందరు దగ్గిర ఓ పక్క పల్లెటూరులో పుట్టిన వాసంతికి ఇదంతా కొంచెం విచిత్రంగానే ఉంది. స్టేజీమీదవున్న పాపకి అందరూ యేవో బహుమతులు తీసుకెళ్ళి ఇస్తున్నారు. ఆ పాపకి పక్కగా, వంటినిండా ధగధగ మెరిసే రాళ్ళనెక్లెస్‌తో, ఎట్టెదు వెడల్పుగల జరీఅంచు పట్టుచీరెతో గట్టిగా బిగించినట్లున్న ఓ స్థూలపాటి వయసుమళ్ళిన సువాసిని బహుమతులు తెస్తున్నవాళ్ళను వాడిచూపులు మాస్తూ నఖశిఖ పర్యంతం పరిశీలిస్తోంది. ఆవిడ ప్రక్కగా నిలబడ్డ ఓ ఖద్దరు చీర ఆవిడ తెచ్చినవాళ్ళు ఇచ్చిన బహుమతులన్నీ జాగ్రత్తగా ఓ ప్రక్కగా పెడుతోంది. ఆలస్యంగా వచ్చి హాలులో వున్న ఆడవాళ్ళని చూచి అలాగే గుమ్మందగ్గిర నిలబడిపోయిన వాసంతి చేతిలోవున్న వెండిసోప్‌బాక్స్ ఒకసారి తడిమి చూచుకుంది. ఎలా ఈ మహాసముద్రంలో ప్రవేశించి డాక్టరుగారి భార్య సుకన్యాదేవి యెక్కడుందో వెతికి పట్టుకోవటం? అసలిలా నలుగురిలోకి రావటం అంటేనే వాసంతికి భయం. ఏదో వ్యక్తిత్వం పోగొట్టుకున్నట్లు తనకేం లేనట్లు జాలిగా, దీనంగా అన్పిస్తుంది. అందులోనూ యిలా ఒంటరిగా ప్రక్కన శేఖరం లేకుండా రావటం వాసంతికి ఇదే మొదటిసారి. అతను పక్కనే ఉంటే ఫర్వాలేదు. తనవి అతనివి అన్ని జవాబులూ తనే చెప్పుకుంటాడు తనుమటుకు అన్నిటికీ సమాధానంగా చిన్నగా నవ్వుతూ ఉంటుంది. అందుకే అసలు ఇక్కడికి గూడా వెళ్ళనంటే 'కాదు, కూడదు వెళ్ళి తీరాలి' అన్నాడు. రెండురోజుల క్రితం క్యాంపువెళుతూ జీపులో కూర్చుని బయలుదేరబోతూ కూడా మరోసారి డాక్టరింటికి పుట్టినరోజుకి తప్పకుండా వెళ్ళిరమ్మని హెచ్చరించాడు. అక్కడికీ తను ఆలస్యంగానే వచ్చింది-ఇప్పటికి చాలా హడావుడి తగ్గిపోయి ఉంటుంది. సుకన్యాదేవి వెంటనే కన్పిస్తుందేమోనని, అయినా అసలు ఇంతమంది వస్తారని తనకేం తెలుసు? లోపలికి వెళ్ళాలంటే ఏదో భయం వేస్తోంది. ఎలా- ఏవో ఆలోచనలతో పరధ్యానంగా నిలబడ్డ వాసంతి "అదేమిటి అలా గుమ్మందగ్గర నిలబడిపోయావేం? లోపలికి రా, రా! ఎంత

సేపయింది వచ్చి? శేఖరం క్యాంపునుంచి రాలేదా?" అంటూ సుకన్యాదేవి భుజంపట్టి పలకరించటంతో ఉలిక్కిపడింది. ఆ వెంటనే తన్ని తను తమాయించుకుంటూ "అబ్బే లేదండీ! ఇప్పుడే వచ్చాను. మీకోసమే చూస్తున్నాను," అంది. చప్పున కళ్ళు చేతిలోవున్న సోప్‌బాక్స్‌మీద వాల్చుకుంటూ 'ఛీ! ఛీ! ఇలా గుమ్మందగ్గర నిలబడి ఉండకూడదు. కాస్తంత ధైర్యంచేసుకుని లోపలికి వెళ్ళి కూర్చుంటే బాగుండేది' అనుకుంటూ "మంచిదానివే! నయం. నే వెంటనే చూశాను కాబట్టి సరిపోయింది. అసలు చూడకనే పోదునే మా అక్కయ్య కూతురు వచ్చి 'గుమ్మందగ్గర పాలరాతిబొమ్మలా నిలబడ్డ ఆ అమ్మాయి ఎవరు పిన్నీ!' అంటే తిరిగి చూశాను" సుకన్యాదేవి నవ్వుతూ వాసంతిని చేయిపట్టి తీసుకొచ్చి ముందు వసారాలో ఉన్న ఓ కుర్చీలో కూర్చోబెట్టింది. ఆవిడింక ఏదో చెప్తూండగా "వెళుతున్నానండీ" అంటూ ఎవరో రావటంవల్ల వాసంతిని "కూర్చో వస్తానని" వెళ్ళిపోయింది.

క్షణంలో వచ్చిన వ్యక్తిత్వం మళ్ళీ పోయినట్లనిపించింది వాసంతికి. ఎవరూ మాట్లాడేవాళ్ళు లేరు. పైపెచ్చు దూరంగా కూర్చున్న యిద్దరు ముగ్గురు నైలాన్ చీర అమ్మాయిలు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వాసంతిని తిరిగి తిరిగి చూచి వాళ్ళలో వాళ్ళు ఏమిటో చెప్పుకుంటున్నారు. వాళ్ళు చెప్పుకునేదేమిటో వాసంతికి విన్పించటంలేదు. ఒకవేళ తనిలా కళ్ళు పెద్దవిచేసుకుని చూస్తుందని, వెర్రిమొహంలా ఉంది. తెలుస్తూనే ఉందని అనుకుంటున్నారేమో' వాసంతి కళ్ళు వాల్చుకుని చీరవంక చూసుకుంది. తెల్లటి పాలనురుగులాటి చీరె. ఈ చీరంటే శేఖరానికి చాలా యిష్టం. శేఖరం గుర్తుకొచ్చేసరికి వాసంతికి మొహంలో భయం, బెరుకుదనం పోయి ఉల్లాసం వచ్చింది. క్యాంపులో ఈ సమయానికి ఏంచేస్తున్నాడో? ఆఫీసులో అతను చాలా గంభీరంగా వుంటాడట! అందరూ భయపడతారని, మళ్ళీ యెవర్నీ ఏమీ అనడని చెప్తాడు రాజు.

ఎక్కడి తను! ఎక్కడ శేఖరం! అదృష్టం అంటే ఇదే కాబోలు. "మీ అయనంటే సామాన్యం కాదమ్మాయోయ్! పెళ్ళికాని ఆడపిల్లల గుండెల్లో మెరుపు. పెళ్ళయిన ఆడపిల్లల గుండెల్లో నిట్టూర్పు." శేఖరంతో తనపెళ్ళి స్థిరపడింతర్వాత తనని పెళ్ళికూతుర్ని చేసినప్పుడు కొత్తబట్టలతో ఆశీర్వాదం కోసం నమస్కరించడానికి వెళ్ళినప్పుడు అన్న మామయ్య మాటలు తనెలా మర్చిపోతుంది? అప్పుడే అక్కడే నిలబడ్డ అక్కయ్య "ఇహ అందరి గుండెల్లోనూ నిట్టూర్పే మామయ్యా! ఒక వాసంతి మొహంలోనే మెరుపు

అతను" అన్నది. ఆ రోజు అవేవో తమాషా మాటలనుకుంది. కానీ యెంత నిజం. కానీ చిత్రం. అన్ని విధాలా వున్న అతను తనలో ఏం చూశాడో! చూసేందుకు ఏముంది? అదృష్టం దయతలచి తన ప్రక్కన నిలబడింది. అయితే-యిదే మాటను తను ఓసారి అంటే అతను "లేదు వాసంతీ! నీలో నేను చాలా చూశాను. ఏం చూశావో చెప్పమని అడగకు. ఒకప్పుడు నాలో ఉండి ప్రస్తుతం పోగొట్టుకున్నదంతా నీలో చూశాను" అన్నాడు. తన కారోజు, ఆ క్షణం చాలా బాగా గుర్తుంది. ఆరోజు ఆదివారం. రాజేంద్రనగర్‌లో కిద్వాయి గార్డెన్ కాటేజ్ రిజర్వ్‌చేయించుకున్నారు. ఎప్పుడోగాని శేఖరానికి అంత తీరిక దొరకదు. ఆ రాత్రి యెంత బాగుంది. కాటేజ్ ప్రక్కనున్న పచ్చగడ్డి మంచుతో తడిసి కొద్దిగా చల్లగా ఉంది. తెల్లటి వెన్నెల స్వచ్ఛమైన మనస్సులా ....చుట్టుప్రక్కల శబ్దమే లేదు. కొంచెం దూరంలో వున్న చెవులపిల్లుల గడ్డి కొరికే పరపర చప్పుడు తప్ప. కాటేజి మధ్యగా శబ్దంచేస్తూ దొర్లే నీళ్ళు. వెన్నెట్లో పచ్చగడ్డిమీద శేఖరం జేబురుమాలు వేసుకుని కూర్చున్న తను, తన ఒళ్ళో శేఖరం తల, యెన్ని యుగాల అనుభవం కలిగింది తనకి. అలా యెన్నికోట్ల సంవత్సరాలు బ్రతికితేమటుకు విసుగొస్తుందా? కాలం నిల్చిపోతే బాగుండు ననిపిస్తుంది. ఎలా నిలుస్తుంది కాలం? తనకు చాతనయితే సూర్యుణ్ణి చంద్రుణ్ణి ఏ లోయల మధ్యకైనా విసిరేది. అవును, వాటినుంచేగా యీ రాత్రిం బవళ్ళు. అది చెయ్యలేని తను శేఖరం చేతిగడియారం తీసి దూరంగా దాచేసింది. అతన్ని గురించి తను యింతగా ఆలోచిస్తున్న యీ క్షణంలో అతనేం చేస్తుంటాడు? ఎందుకో మరి? తను ఉన్నప్పుడు ఓ విధంగా లేనప్పుడు ఇంకోవిధంగా వుంటాడు: బహుశా గంభీరంగా వుండటం అలవాటయి పోవటమే కారణం కావచ్చు. రేపు సాయంత్రంగాని రాడు క్యాంప్ నుంచి. రేపు సాయంత్రం యెప్పటికి అను? మళ్ళీ గడియారంమీద కోపం. తన ఈ ఆలోచన శేఖరంకి తమాషా. చెప్పించుకుని చెప్పించుకుని నవ్వుతాడు. అతనికి తెలియదుగా... అతనికోసం ఓ మంచి వార్త ఉందని. పాపం! అన్నం సరిగ్గా సహించకపోతే వాంతులు చేసుకుంటూంటే ఎంత ఖంగారుపడ్డాడో? అసలు ప్రతి విషయం, ప్రతి మాటా అతను విలువ చేకూరుస్తాడా లేక తను ఊహించుకుంటుందా? మొన్నమటుకు మొన్న క్యాంప్‌కి వెళ్ళబోతూంటే తనని దగ్గరికి తీసుకుని తొందరగా వచ్చేస్తానని భయపడొద్దని చెప్తూ, "నేను వచ్చేలోగా నువ్వు కొంచెం సన్నపడాలి" అన్నాడు. అది నిజమే! అంత అన్నం సహించక

సేపయింది వచ్చి? శేఖరం క్యాంపునుంచి రాలేదూ?" అంటూ సుకన్యాదేవి భుజంపట్టి పలకరించటంతో ఉలిక్కిపడింది. ఆ వెంటనే తన్ని తను తమాయించుకుంటూ "అబ్బే లేదండీ! ఇప్పుడే వచ్చాను. మీకోసమే చూస్తున్నాను," అంది. చప్పున కళ్ళు చేతిలోవున్న సోప్‌బాక్స్‌మీద వాల్చుకుంటూ 'ఛీ! ఛీ! ఇలా గుమ్మందగ్గర నిలబడి ఉండకూడదు. కాస్తంత ధైర్యంచేసుకుని లోపలికి వెళ్ళి కూర్చుంటే బాగుండేది' అనుకుంటూ "మంచిదానివే! నయం. నే వెంటనే చూశాను కాబట్టి సరిపోయింది. అసలు చూడకనే పోదునే మా అక్కయ్య కూతురు వచ్చి 'గుమ్మందగ్గర పాలరాతిబొమ్మలా నిలబడ్డ ఆ అమ్మాయి ఎవరు పిన్నీ!' అంటే తిరిగి చూశాను" సుకన్యాదేవి నవ్వుతూ వాసంతిని చేయిపట్టి తీసుకొచ్చి ముందు వసారాలో ఉన్న ఓ కుర్చీలో కూర్చోబెట్టింది. ఆవిడింక ఏదో చెప్తూండగా "వెళుతున్నానండీ" అంటూ ఎవరో రావటంవల్ల వాసంతిని "కూర్చో వస్తానని" వెళ్ళిపోయింది.

క్షణంలో వచ్చిన వ్యక్తిత్వం మళ్ళీ పోయినట్లనిపించింది వాసంతికి. ఎవరూ మాట్లాడేవాళ్ళు లేరు. పైపెచ్చు దూరంగా కూర్చున్న యిద్దరు ముగ్గురు నైలాన్ చీర అమ్మాయిలు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వాసంతిని తిరిగి తిరిగి చూచి వాళ్ళలో వాళ్ళు ఏమిటో చెప్పుకుంటున్నారు. వాళ్ళు చెప్పుకునేదేమిటో వాసంతికి వినిపించటంలేదు. ఒకవేళ తనిలా కళ్ళు పెద్దవిచేసుకుని చూస్తుందని, వెర్రిమొహంలా ఉంది. తెలుస్తూనే ఉందని అనుకుంటున్నారేమో' వాసంతి కళ్ళు వాల్చుకుని చీరవంక చూసుకుంది. తెల్లటి పాలనురుగులాటి చీరె. ఈ చీరంటే శేఖరానికి చాలా యిష్టం. శేఖరం గుర్తుకొచ్చేసరికి వాసంతికి మొహంలో భయం, బెరుకుదనం పోయి ఉల్లాసం వచ్చింది. క్యాంపులో ఈ సమయానికి ఏంచేస్తున్నాడో? ఆఫీసులో అతను చాలా గంభీరంగా వుంటాడట! అందరూ భయపడతారని, మళ్ళీ యెవర్నీ ఏమీ అనడని చెప్తాడు రాజు.

ఎక్కడి తను! ఎక్కడ శేఖరం! అదృష్టం అంటే ఇదే కాబోలు. "మీ అయనంటే సామాన్యం కాదమ్మాయోయ్! పెళ్ళికాని ఆడపిల్లల గుండెల్లో మెరుపు. పెళ్ళయిన ఆడపిల్లల గుండెల్లో నిట్టూర్పు." శేఖరంతో తనపెళ్ళి స్థిరపడింతర్వాత తనని పెళ్ళికూతుర్ని చేసినప్పుడు కొత్తబట్టలతో ఆశీర్వాదం కోసం నమస్కరించడానికి వెళ్ళినప్పుడు అన్న మామయ్య మాటలు తనెలా మర్చిపోతుంది? అప్పుడే అక్కడే నిలబడ్డ అక్కయ్య "ఇహ అందరి గుండెల్లోనూ నిట్టూర్పే మామయ్యా! ఒక వాసంతి మొహంలోనే మెరుపు

అతను" అన్నది. ఆ రోజు అవేవో తమాషా మాటలనుకుంది. కానీ యెంత నిజం. కానీ చిత్రం. అన్ని విధాలా వున్న అతను తనలో ఏం చూశాడో! చూసేందుకు ఏముంది? అదృష్టం దయతలచి తన ప్రక్కన నిలబడింది. అయితే-యిదే మాటను తను ఓసారి అంటే అతను "లేదు వాసంతీ! నీలో నేను చాలా చూశాను. ఏం చూశావో చెప్పమని అడగకు. ఒకప్పుడు నాలో ఉండి ప్రస్తుతం పోగొట్టుకున్నదంతా నీలో చూశాను" అన్నాడు. తన కారోజు, ఆ క్షణం చాలా బాగా గుర్తుంది. ఆరోజు ఆదివారం. రాజేంద్రనగర్‌లో కిద్వాయి గార్డెన్ కాటేజ్ రిజర్వ్‌చేయించుకున్నారు. ఎప్పుడోగాని శేఖరానికి అంత తీరిక దొరకదు. ఆ రాత్రి యెంత బాగుంది. కాటేజ్ ప్రక్కనున్న పచ్చగడ్డి మంచుతో తడిసి కొద్దిగా చల్లగా ఉంది. తెల్లటి వెన్నెల స్వచ్ఛమైన మనస్సులా ....చుట్టుప్రక్కల శబ్దమే లేదు. కొంచెం దూరంలో వున్న చెవులపిల్లుల గడ్డి కొరికే పరపర చప్పుడు తప్ప. కాటేజి మధ్యగా శబ్దంచేస్తూ దొర్లే నీళ్ళు. వెన్నెట్లో పచ్చగడ్డిమీద శేఖరం జేబురుమాలు వేసుకుని కూర్చున్న తను, తన ఒళ్ళో శేఖరం తల, యెన్ని యుగాల అనుభవం కలిగింది తనకి. అలా యెన్నికోట్ల సంవత్సరాలు బ్రతికితేమటుకు విసుగొస్తుందా? కాలం నిల్చిపోతే బాగుండు ననిపిస్తుంది. ఎలా నిలుస్తుంది కాలం? తనకు చాతనయితే సూర్యుణ్ణి చంద్రుణ్ణి ఏ లోయల మధ్యకైనా విసిరేది. అవును, వాటినుంచేగా యీ రాత్రింబవళ్ళు. అది చెయ్యలేని తను శేఖరం చేతిగడియారం తీసి దూరంగా దాచేసింది. అతన్ని గురించి తను యింతగా ఆలోచిస్తున్న యీ క్షణంలో అతనేం చేస్తుంటాడు? ఎందుకో మరి? తను ఉన్నప్పుడు ఓ విధంగా లేనప్పుడు ఇంకోవిధంగా వుంటాడు; బహుశా గంభీరంగా వుండటం అలవాటయి పోవటమే కారణం కావచ్చు. రేపు సాయంత్రంగాని రాడు క్యాంప్ నుంచి. రేపు సాయంత్రం యెప్పటికి అను? మళ్ళీ గడియారంమీద కోపం. తన ఈ ఆలోచన శేఖరంకి తమాషా. చెప్పించుకుని చెప్పించుకుని నవ్వుతాడు. అతనికి తెలియదుగా... అతనికోసం ఓ మంచి వార్త ఉందని. పాపం! అన్నం సరిగ్గా సహించకపోతే వాంతులు చేసుకుంటూంటే ఎంత ఖంగారుపడ్డాడో? అసలు ప్రతి విషయం, ప్రతి మాటా అతను విలువ చేకూరుస్తాడా లేక తను ఊహించుకుంటుందా? మొన్నమటుకు మొన్న క్యాంప్‌కి వెళ్ళబోతూంటే తనని దగ్గరికి తీసుకుని తొందరగా వచ్చేస్తానని భయపడొద్దని చెప్తూ, "నేను వచ్చేలోగా నువ్వు కొంచెం సన్నపడాలి" అన్నాడు. అది నిజమే! అంత అన్నం సహించక

పోయినా, యేం తినకపోయినా తను బాగానే వుంది. ఒంటి రంగు కూడా ఏదో మెరుపు వచ్చింది. తను లావు అవటం శేఖరానికి ఇష్టంలేదని తనకు తెలియదు. అందుకే అది "ఏం లావయితే! అసలు నేను కొంచెం లావుగా వుంటేనే బాగుంటానని అందరూ అంటారు" అంది. "అబ్బెబ్బే! అదేం కాదవ్వొయి. లావు అయ్యేరోజులు ముందున్నాయి. ఇప్పుడొద్దు. నువ్వు లావయిపోయి, కూర్చున్నచోటునుంచి కదలకపోతే, "మీది మరీ విచిత్రం! అంత లావెందుకు అవుతాను."

"ఎంతయినా వద్దు. నేను క్యాంప్‌నుంచి వచ్చేసరికి చేతులు చాచుకుని పరుగెత్తుకొస్తావు చూడు. బంగారు తీగెలా ఉంటావు. లావయితే బాగుండదు. నువ్వసలు పరుగెత్తలేవు. పరుగెత్తినా నేను చూడలేను." యిద్దరూ నవ్వుకున్నారు. అంత బాగా మాట్లాడి, అంత హుషారుగా మాట్లాడిన నన్ను దగ్గరికి తీసుకోవటంలో ఒళ్ళు వేడిగా ఉందని 'వద్దు నీకు ఒంట్లో బాగాలేదు. నేను క్యాంప్ కాన్సిల్ చేసుకుంటా'నని కూర్చున్నారు. ఆ రోజు అసలు ఉదయం నుంచే వంట్లో బాగాలేదు. ఆ క్రితంరోజే లేడీ డాక్టర్ సుశీలకి ఫోన్‌చేస్తే ఆవిడ లేదు. యెక్కడికో వెళ్ళిందన్నారు. క్యాంప్ వెళ్ళే హడావుడిలోవున్న శేఖరంకూడా పట్టించుకోలేదు. తనూ అంత అనుకోలేదు. ప్రయాణం అయి జీప్‌లో సామానంతా పెట్టించి, బట్టలు వేసుకుని టై కట్టుకుంటూన్న శేఖరం తను లోపలికి వెళ్ళి కాఫీతో తిరిగివచ్చేసరికి టై విప్పి టేబిల్‌మీద పారేసి వచ్చి పడక కుర్చీలో పడుకున్నాడు. తనకు తెలుసు—అతను వెళ్ళి తీరాలి చాలా ముఖ్యం అని. డాక్టర్ సుశీల రాగానే పిలిపించుకుంటానని లేకపోతే నేనే వెడతానని యెన్నో చెప్పి వప్పిస్తే కాని అతను లేచి మళ్ళీ టై కట్టుకోలేదు. "లేదు నేను సరిగ్గా చూడనేలేదు. నీ మొహం చాలా పీక్కుపోయింది. తెలుసా?" అతని మొహంలో బాధకి తనకు నవ్వు వచ్చిందిగానీ అదెంత హాయి! మరో అరగంటలో....వెళ్ళిన తర్వాత తనకెంత దిగులో! మళ్ళీ అతన్ని కళ్ళతో చూస్తానా అన్పించింది. ఆ మర్నాడు సుశీల వచ్చింది. వస్తూనే ఆవిడ వేసిన మొదటి ప్రశ్నకి తనిచ్చిన జవాబులోనే చెప్పేసింది. ఆ తర్వాత పరీక్షకూడా చేసి నవ్వుతూ "ఆడపిల్లా—మగపిల్లవాడా?" అని అడిగింది. ఎక్కడో ఏదో ఆలోచిస్తున్న తను ఆవిడ ప్రశ్నకి సమాధానాన్ని అంతా గుర్తించకుండానే "ఎవరికి ?" అంది ఎవరన్నా ప్రసవించారో—ప్రసవిస్తారో అనుకుంటూ. యెవరన్నా ప్రసవిస్తారు అన్నప్పుడే, చేతి వ్రేళ్ళలో రెండు చూపించి పట్టుకో

మనటమో లేక ఆడపిల్లా, మగపిల్లవాడు కావాలా అని అడగటమో చేస్తారు. డాక్టర్ సుశీల విరగబడి నవ్వుతున్నప్పుడుగాని తనకి గుర్తురాలేదు ఆవిడ ప్రశ్న, తన జవాబు. ఆవిడ పరీక్ష-అన్నీ. క్షణంసేపు గుండె కొట్టుకొనటం మానేసింది. ఇహ అసలు కొట్టుకోదేమో అన్పించింది. కూర్చున్న కుర్చీకి తన శరీరం అంటుకుపోయినట్లయింది. ఏమిటీ? తనకా? పాపా! ప్రపంచం అకస్మాత్తుగా మారిపోదేం? వస్తువులన్నీ యిలాగే ఉంటాయేం? కిటికీ తలుపులన్నా కదలవేం. గాలయినా గట్టిగా వీచదేం? ఆకాశంలో మేఘాలయినా పరుగెత్తవేం? గుమ్మం అవతల వరండా దిగువగా పచ్చటి చెట్లమీదపడి మెరుస్తున్న సూర్యకాంతి పకపకా నవ్వదేం? ఏం జరగదేం? యిదేమిటి ఇలా ఆలోచిస్తుందేం తను? "నిజంగానా?" జీరపోయిన గొంతుతో డాక్టరు సుశీల వంక చూస్తూ అంది తను. "మీరు బలే తమాషా చేస్తారండీ! కళ్ళల్లో అన్ని భావాలు కదుల్తాయేమిటి? నిజంగానే చెప్తున్నాను. వారు క్యాంపు నుంచి రాగానే మొదట నాకు బహుమతి యిప్పించాలి. కాన్పూ అదీ నేనే చూస్తాను." నల్లగా పొడుగ్గా వున్న సుశీల తెల్లటి పళ్లన్నీ తళుక్కుమనేట్లు నవ్వి అంది. ఆవిడ వైపే తదేకంగా చూస్తున్న వాసంతికి ఆవిడ చేతిలో ఓ పసికందుని తెల్లటి తువాల్తో తుడుస్తూ "మీ పోలికండి. ముక్కుమటుకు తండ్రిది పుణికి పుచ్చుకున్నాడు. పాప చాలా ఆరోగ్యంగా వుంది. చూశారా! మీరు నాకు మంచి బహుమతి ఇవ్వాలి" అంటున్నట్లు తను ఏదో మంచంమీద పడుకుని, చెవుల్లో దూదితో నీరసంగా పడుకుని ఆసక్తిగా భయంగా ఆ పసిపాప వైపు చూస్తున్నట్లు అన్పించింది. తనసలు ఎప్పుడూ అంతే-ఉన్న విషయానికి, జరుగుతూన్న క్షణానికి పదింతలు ముందుకు దూసుకుపోయి ఆలోచిస్తుంది. ఆ క్షణంలో ఇప్పుడు జరుగుతున్న దాన్ని గురించి ఎప్పుడూ ఆలోచించదు. జరిగిపోయిన వాటిని గురించయినా ఆలోచిస్తుంది. వర్తమానాన్ని గురించిన ప్రసక్తే ఉండదు. అది గతంగా మారేవరకు ఏమిటో ఒక్కొక్కళ్ళ స్వభావం. సీతయితే-"జరిగిపోయింది, జరగబోయేది నాకు అక్కర్లేదు. జరుగుతున్నవే నాకు కావాలి. జరిగిందాంతో మనకు ప్రసక్తిలేదు. అది తిరిగిరాదు. ఎంత గొప్ప అనుభవం అయినా సరే-జరగబోతుందంటావా? అయోమయం, అర్థంకాదు. మనతోపాటు ముందుకు పరుగెత్తే పెద్దగోడ భవిష్యత్తు, యెప్పటికప్పుడు దాని వెనక ఏం వుందీ మనకి తెలియనే తెలియదు. అది తెలుసుకోవాలనే ప్రయత్నంలోనే మనం పరుగెత్తుతుంటాం. చివరకు తెలుసుకోకుండా

పోతుంటాం" అంటుంది. దానిది మరీ వేదాంతం. బ్రతుకంటే క్షణంలో సగంట. ఆ క్షణంలో సగంలోనే చాతనయితే ఇంద్రధనుస్సులో రంగులన్నీ చూసినట్టు అన్నీ అనుభవించగలగటం. దాని మొహం. మరీ అంత చిన్న వయసులో అంత వేదాంతం ఉండకూడదు బాబూ! అలాటి వాళ్ళకి యిల్లూ, సంసారాలు కూడా పట్టవు. సీత అదే అంటుంది. "భర్తగాని, పిల్లలుగాని ఇవన్నీ ఓ బాధ్యత కింద మనం చెయ్యవలసిన పనుల క్రింద తీసుకోవాలి" అంటుంది. తనకి శేఖరం ఎప్పుడూ లోకంగా కనిపిస్తాడు గానీ బాధ్యతగా అన్పించడు. తనకి పిల్లలు కావాలి, భర్త కావాలి, అన్నీ కావాలి. రేపు తనకి కూడా ఓ పాప పుడితే ఇలాగే పుట్టినరోజు చేసుకోదూ? తనప్పుడు ఎలా ఉంటుంది? శేఖరం చెప్పినట్లు లావయి, నిండుగా జడమానేసి మెడమీదకు చుట్టతో ఉంటుంది కాబోలు. అమ్మో! యిలా సన్నగా ఉంటేనే బాగుంటుంది. చిన్నతనం మనసుంచి వెళ్ళిపోతుంటే ఎంత బాధేస్తుంది–అందుకే కాబోలు మనకు తెలియకుండానే మన పెద్దవాళ్ళం అయిపోతూనే ఉంటాం.

చాలాసేపట్నుంచీ తదేకంగా ఆలోచిస్తున్న వాసంతి యెవరో వచ్చి పలకరించటంతో ఈ లోకంలో పడింది. ఆ వచ్చిన అమ్మాయి సుకన్యాదేవి అక్క–కూతురు కాబోలు, "పిన్ని మిమ్మల్ని లోపలికి పిలుస్తోంది," అంటూ వచ్చింది. యిదేమిటి? చాలాసేపయింది. వాసంతి ఖంగారుగా లేచి నిలబడింది. హాలులో చాలా భాగం ఖాళీ అయిపోయింది. గోడవారగా కూర్చున్న ఆంగ్లో ఇండియన్స్ వెళ్ళిపోయారు. హాలులో చాలకొద్దిమంది మిగిలారు. స్టేజీగూడా ఖాళీఅయింది. వాసంతి దిక్కు–లు చూడటం మానేసి తనని పిలవటానికి వచ్చిన అమ్మాయితో "యెక్క–డికి రావాలి?" అంది. "లోపలికి, అక్క–డ ఫలహారంచేసి మళ్ళీ వచ్చి కూర్చుందురుగాని" దూరంగా కూర్చుని అంతకుముందు వాసంతిని చూసి నవ్వుతూ కబుర్లు చెప్పుకున్న అమ్మాయిలవంక మెడతిప్పి చూసి నవ్వుతూ అంది. ఆ అమ్మాయి వాళ్ళని చూచేసరికి వాసంతికి మళ్ళా దిగులు ముంచుకు వచ్చింది. వాళ్ళింకా అలాగే చూస్తూ ఉన్నారు. "రండి" అని పిలుస్తున్న ఆ అమ్మాయితో ఎలాగో లోపలకు వెళ్ళటోయింది. వాసంతి గుమ్మానికి కొంచెం ఇవతల ఉండగానే ఆ ముగ్గురు అమ్మాయిలు వాసంతివైపుకు వచ్చారు. "పరిచయం చెయ్యాలా–ఇదుగో వీళ్ళు నా స్నేహితురాళ్ళండీ. ఈమె వాసంతి అని శేఖరంగారి భార్య–వారు మా బావగారు. మంచి ఫ్రెండ్స్!" అంది సుకన్యాదేవి పిన్ని కూతురు. వాళ్ళ ముగ్గురికీ నమస్కా–రాలు చేసింది వాసంతి.

అందులో మధ్య అమ్మాయి అంది "మిమ్మల్ని చూసింతర్వాత మీతో తప్పకుండా పరిచయం చేసుకోవాలనిపించిందండీ! మీ కళ్ళు చాలా బాగున్నాయి. ఇందాకటి నుంచీ మీవంకే చూస్తున్నాను."

వాసంతి కళ్ళు క్రిందకి వాలిపోయాయి. అంత ధైర్యంగా నిర్మొహమాటంగా మొహంమీద చెప్పేస్తున్న అమ్మాయివంక కళ్ళెత్తి చూడటం గూడా భయమనిపించింది.

"ఆ అమ్మాయి కథలు రాస్తుందిలే అందుకు—" అంది మరో అమ్మాయి. "అది అనవసర ప్రసంగం" మొదటమ్మాయి కసిరింది. పేరడిగింది. వాసంతి జవాబు చెప్పింది. ఆ అమ్మాయి పేరు వాసంతికి పరిచయమే. కథలుకూడా బాగానే ఉంటాయి. కానీ ఆ అమ్మాయి వయసు తక్కువగా వుందే-అంత మంచి కథలు రాయడం యెలా వస్తుందీ అనుకుంటున్న వాసంతికి "పదండి, లోపల పిన్ని వెయిట్ చేస్తుంది" అంది సుకన్యాదేవి అక్కకూతురు. మరోసారి వాళ్ళ ముగ్గురికీ నమస్కారంచేసి వాసంతి ఇవతలకు వచ్చింది. అప్పటికే సుకన్యాదేవి బయటకు వచ్చేసింది. "మీరు లోపలకు వెళ్ళండి. చూడు గిరిజా, వాసంతిని లోపలకు తీసుకువెళ్ళు. ఇక్కడ అహల్యాదేవి వెళ్తున్నానంటున్నారు పంపిస్తాను. లోపలికి వెళ్ళు వాసంతీ! సిగ్గుపడకు." మాటలు చెప్తూనే ఆవిడ హడావుడిగా వెళ్ళిపోయారు. గిరిజ లోపలికి వెళుతుండగా వాసంతి చటుక్కున చేయిపట్టి ఆపి "మీ అక్కయ్య కూతురెక్కడ?" అంది చేతిలో వుండిపోయిన సోప్‌బాక్స్ గుర్తుకురావటంతో. "ఎవరూ-జయంతా? అక్కడ ఆ గదిలో వుందే" అంది గిరిజ. ఆగిపోతూ, వాసంతి తలతిప్పి చూసింది. గిరిజ చూపించిన గదిలో జయంతి, ఆవిడ ప్రక్కన ఆ లావుపాటి ఆవిడ, ఖద్దరుచీర ఆవిడ ఉన్నారు. "నువ్వొక్క పనిచేసిపెట్టు నేను వెళ్తూవుంటాను. నువ్విది మీ జయంతి కిచ్చేసిరా?"

"అదేమిటి-మీ రివ్వండీ" గిరిజ అనుమానంగా చూస్తూ అంది.

"కాదు వారిపేరు చెప్పి నువ్విచ్చేసిరా?" బ్రతిమాలుతున్నట్లు అంది వాసంతి. క్షణంసేపు మొహంలోకి చూసిన గిరిజ సోప్‌బాక్సు తీసుకొని వెళ్ళింది. "ఎంత త్వరగా ముగించుకుని బయటపడితే అంత బాగుండు-ఏదీ ఇక్కడ ఇందాక రక్షసిభటుల్లా నిలబడ్డ అమ్మాయిలు లేరే? పోయారే" అనుకుంటూ తలవంచుకుని లోపలికి వస్తున్న వాసంతికి అలాగే తలవంచుకుని గబగబా లోపల్నుంచి వస్తున్న మరో వ్యక్తి తపీమని తలకొట్టింది. ఇద్దరూ ఒక్కసారి అబ్బా అనుకొని దెబ్బ తగిలిన

చోటు పట్టుకుని తలెత్తి చూశారు. "సారీ, చూడలేదు" అంది అవతల వ్యక్తి. వాసంతి ఎత్తేవుంది. కానీ నాలుగైదు సంవత్సరాలు పెద్దదిలా వుంది. పొడుక్కి తగ్గ లావుతో, మనిషి హుందాగా వుంది. చాలా అందంగా శరీరసౌష్ఠవానికి చక్కగా అతికినట్లున్న చీరె, జాకెట్-కానీ జాకెట్ చేతులు భుజాల దిగువగా పొట్టిగా చాలా బిగుతుగా ఉన్నాయి. చెంపలకి చీరెచెంగుతో కలిసే ద్రాక్షగుత్తుల్లా ఉన్న ప్లాస్టిక్‌వి ఉన్నాయి. పెదవులకి రంగుంది. కానీ రంగు వేసుకున్నట్లు లేదు. చాలా సహజంగా ఉంది.

"సారీ దెబ్బతగిలిందా?" అంది ఆవిడ నవ్వుతూ.

"లేదు ఫర్వాలేదు" వాసంతిగూడా నవ్వింది.

"వెరీ వెరీ సారీ!" వాసంతిని తప్పించుకొని వెళ్ళిపోయింది ఆవిడ. ఆవిడని ఇంకా సాంతం చూడటం పూర్తిగాని వాసంతి తలతిప్పి ఆవిడ వచ్చినవైపే చూస్తుండిపోయింది. వెనక నడినెత్తిమీదికి జుట్టు మెలితిప్పి చుట్టిన చుట్ట వెనక జాకెట్‌కి వీపుమీద డైమండ్ ఆకారంలో బట్టలేదు. ఆ బట్టలేనంతమేర బిగువుగా అందంగా శరీరం కన్పిస్తోంది. మెడలో గొలుసుండే భాగంనుంచి ఆ కత్తిరించిన ఆకారం మీదుగా పట్టుకుచ్చులు చిన్నచిన్నవి నడుందాకా వేళ్ళాడుతున్నాయి. నడకకూడా బాగానే వుంది. వెడుతూ వెడుతూ ఆవిడ ఒకసారి వెనక్కి తిరిగిచూసి ఇంకా అలాగే నిల బడిపోయి తనవంక చూస్తున్న వాసంతినిచూసి మళ్ళీ నవ్వి వెళ్ళిపోయింది. ఆవిడ చూడగానే వాసంతి చప్పున మొహం తిప్పుకుంది. ఇంతలో గిరిజ వచ్చింది. "ఆవిడెవరు?" దూరంగా వెళ్ళిపోయి సుకన్యాదేవితో మాట్లాడుతున్న ఆవిడని చెయిచాచి వేలుపెట్టి చూపిస్తూ అంది. "యెవరూ? ఆవిడా, మా అక్కయ్య ఫ్రెండ్, బొంబాయిలో ఉంటారు. ఆవిడ భర్త అమెరికా వెళ్ళి వచ్చారు. ఆమెకూడా వెళ్ళివచ్చింది" లోపలకు దారితీస్తూ అంది గిరిజ.

ఫలహారం అదీ ముగించుకుని గిరిజతోపాటు యివతలకు వచ్చింది వాసంతి. హాలు పూర్తిగా ఖాళీ అయిపోయింది. పెద్ద వర్షం గబగబా పడి ఒక్కసారి తెరిపివచ్చినట్లుగా ఉంది. హాలులో దీపాలగుత్తి క్రిందుగా నిలబడి ఆవిడ, సుకన్యాదేవి ఇంకా ఏదో మాట్లాడుకుంటూనే వున్నారు. "ఆగండి, మీకు కిళ్ళీ తీసుకొస్తాను" అంటూ గిరిజ మధ్యలో వెనక్కి వెళ్ళిపోయింది, "ఇక్కడకు రా వాసంతీ" దూరంగా నిలబడి సుకన్యాదేవి పిలవడంతో గిరిజకోసం చూస్తున్నట్లు నిలబడిన వాసంతి కదిలి ముందుకు వెళ్ళింది. "ఈవిడ నా స్నేహితురాలు

అమూల్య." ఈవిడ పేరు అమూల్యా? మనిషిలానే పేరుగూడా చక్కగా అమూల్యంగానే ఉంది అనుకొంది. వాసంతి చేతులు జోడించి నమస్కరిస్తూ "నీ పేరేమిటి వాసంతా?" అంది ఆవిడ బాగాదగ్గరగా వచ్చి. ఆవిడ చూపుల్లో ఇందాకటి మార్దవం, లాలిత్యం రెండూ లేవు. ఏవో చురకలు వేసినట్లు, అవి తగిలిన చోటల్లా గుచ్చుకుంటున్నట్టూ ఉన్నాయి. ఆవిడలో ఆ మార్పు యెందుకు వచ్చిందో అర్థంగాని వాసంతి అచేతనంగా అలాగే నిలబడిపోయింది. పైనవున్న దీపాల గుత్తిలోంచి వస్తున్న రంగురంగుల కాంతులు ఆవిడ మొహంమీద నీలంగా, సుకన్యాదేవి మొహంమీద ఎఱ్ఱగా, తన మొహంమీద తెల్లగా నడుస్తున్నాయి.

"శేఖరం నీకు పెళ్ళికిముందే తెలుసా?" హఠాత్తుగా ఆవిడ చెయిచాచి వాసంతి గడ్డాన్ని మునివేళ్ళతో పట్టుకుని ఎత్తుతూ అంది. ఆ ఎత్తడం ప్రేమగా కాక అదేదో ఆసక్తిగా ఉంది. అసలు సుకన్యాదేవి ఆవిడకి తనను పరిచయం చేసిందిగాని, తనకు ఆవిడకు పరిచయం లేదు. కానీ తన పేరు ఆవిడకి తెలిసింది. పోనీ, అది ఆవిడకి ఈవిడ చెప్పివుండచ్చు కానీ శేఖరం సంగతి అడుగుతుం దేమిటి? గడ్డాన్ని ఆవిడచేతిలోంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ ఆవిడ చూపులతో కలిసిన తన చూపుల్ని క్రిందికి తిప్పుకుంది వాసంతి. "కొంచెం సిగ్గులా ఉందే! లేకపోతే కొత్తా!" ఆవిడ గడ్డం వదలకుండానే అంది. పై నుంచి వస్తున్న రంగురంగుల కాంతులు, యెదురుగుండా యీవిడ వింత ప్రవర్తన, నిశ్శబ్దంగావున్న హాలు, చాలాసేపట్నుంచి కూర్చుని కూర్చుని అలసిపోయినట్లుగా ఆదోమాదిరిగావున్న వాసంతికి అదేదో కలలో యెక్కడో వంటరిగా కూర్చుని ఆలోచిస్తున్న ఓ దృశ్యంలా అన్పిస్తోంది. ఆవిడ ప్రశ్న కేదో సమాధానం చెప్దామని అనుకుంటూండగానే హఠాత్తుగా వెనకనుంచి "వసూ!" అదే పిలుపు విన్పించటంతో ముగ్గురూ ఉలిక్కిపడి వెనక్కి తిరిగారు. "అరె మీరా? యెప్పుడొచ్చారు? రేపుగదా రావాల్సింది" గిరుక్కున వెనక్కి తిరిగిన వాసంతి శేఖరాన్ని చూడటంతోనే ఒక్క పరుగులో దగ్గరకు వచ్చింది. "మీరు రేపు సాయంత్రంగానీ రారనుకున్నాను. యెలా వచ్చారు?" సంతోషంతో వికసించిన మొహంతో వాసంతి భర్తచెయ్యి తనచేతిలోకి తీసుకోబోయింది. కానీ శేఖరం వాసంతిని గమనించలేదు. అతని చూపులు దూరంగా నిలబడ్డ వస్తువు మీద రెప్పవాలకుండా చూస్తున్నాయి. తనచేయి పట్టుకోబోతూ అడ్డుగా వచ్చిన వాసంతిని ప్రక్కకు లాగాడు. ఊహించని యీ ప్రవర్తనతో తెల్లబోయిన

వాసంతి, శేఖరం చూస్తున్నవైపు చూసింది. దూరంగా రంగురంగు దీపాల గుత్తిక్రింద నిలబడ్డ అమూల్య తల కొంచెంగా ప్రక్కకు ఒరగపెట్టి అదో రకమైన చిరునవ్వులో ఠీవిగా నవ్వుతూ శేఖరంవైపు చూస్తోంది. శేఖరంగూడా చూస్తున్నాడు. కానీ బాధగా, అసహ్యంగా, కోపంగా ఉన్నాయి ఆ చూపులు. వాసంతికి అవి పరిచయంలేవు. ఒకటికి రెండుసార్లు ఆవిడవంక, శేఖరంవంక, కొయ్యబొమ్మలా నిలబడిపోయిన సుకన్యాదేవి వంక తలతిప్పి చూసింది వాసంతి.

"పద పోదాం!" హఠాత్తుగా భార్య భుజంచుట్టూ చేయివేసి తిప్పేస్తూ అన్నాడు శేఖరం.

"అదేమిటి! రండి లోపలికి వెళ్దురుగాని" చలనం తెచ్చుకున్న సుకన్యాదేవి ముందుకువస్తూ గబగబా అంది.

"అక్కర్లేదు. ముందు మీరు నాకు చెప్పినట్లయితే వాసంతిని ఇక్కడికి రానిచ్చేవాడినికాదు" కఠినంగా జవాబిచ్చిన శేఖరం మరుక్షణంలో వాసంతిచేయి పట్టి ముందుకు గుంజుకుపోయాడు. "ఎవరావిడ? ఎందుకిలా చేస్తారు!" శేఖరం లాక్కొస్తూంటే వచ్చేస్తున్న వాసంతి వెనక్కు తిరిగిచూస్తూ అంది. ఆవిడ యింకా అలాగే నిలబడి ఉంది. కాని యీసారి మొహంలో ఠీవిగావున్న ఆ చిరునవ్వు లేదు.

ఐదు నిమిషాల్లో చేరవలసిన దోవ పదలి చుట్టూ అరగంటకి కాని యింటికి తీసుకురాలేదు శేఖరం. దోవలో మళ్ళీ తనే అడిగింది వాసంతి. "ఎవరావిడ? మీకు తెలుసా?" అని. కానీ శేఖరం జవాబు చెప్పలేదు. పెదవులు బిగించి రోడ్డుని తదేకంగా చూస్తున్నాడు. మరోసారి యేదో అడగబోయింది వాసంతి. "నన్ను మాట్లాడించకు. ఆవిడ నాకు తెలుసు. అంతే!" కోపంగా పెళ్ళయిన తర్వాత మొట్టమొదటిసారిగా గట్టిగా కసురుతూ అన్నాడు శేఖరం. వాసంతి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. మధ్య తనేంచేసిందనీ? అసలు యిలా మధ్యలో క్యాంపునుంచి రావటం ఏమిటి? పోనీ వచ్చాడు. కానీ వచ్చారన్న సంతోషంలేకుండా ఇదేమిటి? కళ్ళనుంచి ఉబికి బుగ్గలమీదకు జారుతున్న నీళ్ళని తుడుచుకోవటానికి ప్రయత్నించలేదు. తుడుచుకుంటే అతనికి ఏడుస్తున్నట్లు తెలుస్తుంది. అతను రాగానే తను ఎన్ని చెప్పాలనుకొంటోంది! అన్నీ పోయినాయి. నిటారుగా కూర్చుండిపోయింది వాసంతి.

ఇంటికి వస్తూనే అలవాటు ప్రకారం కారుని గేరేజ్‌లో పెట్టకుండానే వరండా

మెట్లముందు వదిలేసి శేఖరం లోపలికొచ్చి గదిలో, కుర్చీలో కూలబడ్డాడు మాటా పలుకూ లేకుండా. తనకు సంబంధించనట్లున్న శేఖరాన్ని అలా మొదటిసారిగా చూస్తున్న వాసంతికి అతని దగ్గరకు వెళ్ళే సాహసం లేక హాలులో కిటికీదగ్గర అలాగే నిలబడిపోయింది. ఎవరసలావిడ? శేఖరం యెందుకిలా అయ్యాడు? వాసంతికి తలపగలగొట్టుకున్నా అర్థంకావటంలేదు.

గదిలోకి వచ్చేసిన శేఖరం లైటువేసి బూట్లుకూడా విప్పుకోకుండా పడక్కుర్చీలో వాలిపోయాడు. హఠాత్తుగా అతనిలో శక్తి అయిపోయిన ట్లయింది. "మళ్ళీ అమూల్య ఎందుకు కన్పించినట్లు? నాలుగు సంవత్సరాల క్రితం రెండు సంవత్సరాల దాంపత్య జీవితంలో నరకం చూపించి తనని కాదని, అసమర్థుడని తీసిపారేసి మరొకరితో కలకత్తా వెళ్లిపోయిన అమూల్య మళ్ళీ ఎందుకొచ్చింది తన జీవితంలోకి? అమూల్యతో జీవితం, కలకత్తానుంచి రాసిన ఆఖరి ఉత్తరం అన్నీ కలిపి తనని మనశ్శాంతికి దూరంచేసి పిచ్చివాడిలా చేసి దేశాలవెంట తరిమినాయి. యెలాగో కోలుకున్నాడు. పగిలిన హృదయపు ముక్కలు ఏరియిచ్చింది వాసంతి. వాటిని వాసంతి అమాయకపు హృదయం సాయంతో అత్యవసరం పెట్టుకున్నాడు. మళ్ళీ వచ్చింది అమూల్య. అమూల్యని ఎదిరించే సాహసం తనకెప్పటికీ రాదా? యిప్పుడు మరోసారి పిచ్చివాణ్ణి చెయ్యడానికే పనిగట్టుకు వచ్చిందా అమూల్య? వాసంతి. పిచ్చి వాసంతి. ఇదంతా చూసి యేమనుకుంటుందో? తన మొదటి భార్య బ్రతికిఉందని వాసంతికి తెలియదు. శేఖరం కుర్చీలో లేచి కూర్చుని "వసూ!" అని పిల్చాడు. పిచ్చిపిల్ల! అసలే కాస్తంత వాటిని గంపంతగా వూహించుకుని కళ్లు పెద్ద పెద్దవి చేసుకుని చూస్తుంటుంది. ఒకవేళ అమూల్య భర్త ఇక్కడకు ఉద్యోగరీత్యా వస్తే తను యీ ఉద్యోగాన్ని, యీ ఊరిని వదిలేసి వాసంతిని తీసుకుని ఏ పల్లెటూరికైనా పారిపోతాడు. "ఇక్కడికి రా, లైటు వెయ్యి!" నెమ్మదిగా వస్తున్న అడుగుల చప్పుడు విని మళ్ళీ వెనక్కువాలి పడుకున్నాడు శేఖరం. వాసంతి లైటువేసి యింకా చేతిని అలా స్విచ్‌మీదనే ఉంచి శేఖరాన్ని గమనిస్తోంది.

"అలా నిలబడ్డావేం! దగ్గరకు రా!" చేయిచాపి ఇస్తూ అన్నాడు.

"మీరలా ఎందుకున్నారు?" ఆవిడ ఎవరు అనే ప్రశ్న మళ్ళీ నాలిక చివరిదాకా వచ్చి ఆగిపోయింది.

"ఎలా ఉన్నాను? నాకు ఒంట్లో బాగాలేదు. అందుకే తిరిగి వచ్చేశాను. నిజం. భోంచేద్దాం పద!" లేచి సరిగ్గా కూర్చుని వంగి కాలిబూటు విప్పుకుంటూ అన్నాడు.

ఆ రాత్రి అతను నిద్రపోలేదు. వాసంతికూడా నిద్రపోలేదు చాలా రాత్రయింతర్వాత మంచంమీద నిద్రలేకుండా అటూయిటూ దొర్లుతున్న అతన్ని చాలాసేపట్నుంచీ గమనిస్తున్న వాసంతి లేచి కూర్చుని "వున్న విషయం ఏమిటో పైకి చెప్తే కొంతయినా మనశ్శాంతి లభిస్తుంది. ఏ విషయం అయినా భార్యతో చెప్పటానికి జంకెందుకు చెప్పండి. మీ ఆనందంలోనే కాదు. మీ బాధలో గూడా నాకు భాగం ఇవ్వాలి." శేఖరం వాసంతి మాటలకు జవాబివ్వ లేదు. కానీ బోర్లగా పడుకొని దిండులో తలదాచుకొని బాధగా అటూ యిటూ కదులుతున్నాడు.

"పోనీండి మీరింత చెప్పటాని కిష్టంలేకపోతే చెప్పొద్దు. మీరు నిజంగా వంట్లో బాగాలేకనే తిరిగివచ్చినట్లయితే నిద్రపోవటానికి ప్రయత్నించండి" శేఖరం జుట్టులో వేళ్లుపోనిస్తూ అప్యాయంగా అంది.

ఆడవాళ్లని అనుభవాలు చిత్రంగా ఎదిగిపోయేటట్లు చేస్తాయి. యెందుకో రెండుగంటల క్రితం తనకీ_ఇప్పటికీ చాలా తేడా కనిపిస్తోంది వాసంతికి. ఏదో పెద్దరికం వచ్చేసింది. హఠాత్తుగా ఉన్నట్లు వాసంతి చేయితీసుకుని గట్టిగా పట్టుకొని "నువ్వు నాకీ ప్రశ్నకు జవాబు చెప్పు. నేను ఈ ఉద్యోగం, ఈ డబ్బు లేకుండా ఎక్కడికి రమ్మంటే అక్కడకు వస్తావా!" అతనేం మాట్లాడుతున్నాడో వాసంతికి అర్ధంగావటంలేదు. శేఖరం తిరిగి సరిగా పడుకున్న భార్య చెయ్యి కళ్లకి అన్చుకుంటూ "చెప్పు వసూ! ఏది మనిద్దర్నీ విడదియ్యలేదని చెప్పు. నువ్వు నన్ను పెళ్ళిచేసుకున్నానని, యెప్పుడూ నా ప్రక్క వదలనని చెప్పు! నా మనశ్శాంతి దూరంకాదని చెప్పు. చెప్పవూ ?" కళ్ళుమూసుకొని అంటున్న అతను హఠాత్తుగా కళ్ళు తెరచి రెండుచేతులూ చాచి దగ్గరకు లాక్కుంటూ "చెప్పు! చెప్పు. ఎలాటి పరిస్థితులలోనూ నిన్ను వదిలిపెట్టి వెళ్ళనని చెప్పు. అబద్ధం అయినా సరే ఇట్ప్పటికిలా చెప్పు. మనసారా చెప్పవూ ?" తన భుజాలు విరిగిపోతాయేమో నన్నంత గట్టిగా పట్టుకొని పిచ్చిగా చూస్తున్న భర్తకళ్ళల్లోకి లోతుగా, పరీక్షగా చూసింది వాసంతి. అతని కళ్లు దేన్నో ఒకసారి పోగొట్టుకుని మరోసారి పోగొట్టుకుంటానేమోనని భయంతో ఉన్నాయి. "ఆవిడెవరో ముందు చెప్పండి?" శేఖరం చప్పున వాసంతిని వదిలేసి మొహం ప్రక్కకు తిప్పుకున్నాడు.

"పోనీ, నన్నేం చెయ్యమంటారో చెప్పండి?" మరోసారి కళ్లల్లో తిరగబోతున్న నీళ్ళని బలవంతాన ఆపుకోడానికి ప్రయత్నిస్తూ అంది.

"ఆవిడ అమూల్య!" ఎలాగో అన్నాడు శేఖరం

"అవును, అది ఆవిడ పేరు అయితే-ఆవిడేమయినా మీ మొదటి భార్యకు బంధువా ?"

"కాదు అమూల్యే-నీకు తెలియదు. నా మొదటి భార్య బ్రతికిఉందని, నన్ను వదిలేసి పారిపోయిందని." వాసంతికి నోటమాటరాలేదు - "ఏమిటది, ఏమిటది" మనసులో యెవరో దిగులుగా యేడవబోతున్నారు. "ఆవిడ చచ్చిపోలేదూ?" శేఖరం మొహంలోకి చూస్తూ అంది. వాసంతికి హఠాత్తుగా నీరసం వచ్చేసింది. "కాదు, యేం చెప్పాలో తెలియక మీ మామయ్యవాళ్ళకి చచ్చిపోయిందని చెప్పాను. అబద్ధం ఆడాను. అందులో నా తప్పులేదు. వాసంతీ! వింటానంటే ఓపికవుందంటే నీకు ఓ కథ చెప్తాను" దగ్గరగా లాక్కొని గుండెలకి నొక్కుకుంటూ అన్నాడు శేఖరం.

"చెప్పండి !" నీరసంగా అంది వాసంతి. 'అయ్యోయి వాసంతీ-అయింది నీ పని. ఇహ నీ యిష్టం' వాసంతి మనసులో గట్టిగా అరుస్తున్నా రెవరో. "అబద్ధం-అబద్ధ-ఏంకాదు. ఇదో కల. కాసేపటిలో కరిగిపోతుంది. అప్పుడు తను లేచి కూర్చుని శేఖరానికి ఇదంతా వర్ణించి చెబుతుంది. ఇంకోళ్ళు పోట్లాడుతున్నారు" శేఖరం చెప్పడం మొదలుపెట్టాడు.

అమూల్యని అతను యెప్పుడు యెక్కడ చూసాడో సరిగ్గా జ్ఞాపకంలేదు. అప్పటికింకా ఆంధ్రప్రదేశ్ రాలేదు. శేఖరంతండ్రి మద్రాసులో హైకోర్టువకీలుగా పనిచేస్తూండేవాడు. అవి అతను చదువుకునే రోజులు. అమూల్య ఏ కాలేజీలోనూ చదువుకోవటంలేదు. ఇంటరు మూడుసార్లు తప్పి ఇంట్లోనే కూర్చుంది. అమూల్య తండ్రి ఎలక్ట్రిక్ పార్ట్సు అవీ అమ్మే వ్యాపారం చేస్తుండేవాడు. కారు, పెద్ద బంగళా, నౌకర్లు, చాలా అట్టహాసంగానే ఉండేవాడు. వస్తుతః ఉత్సాహవంతుడు. పదిమందిని కలుపుకొని యేపని అయినా యిట్టే నెరవేర్చే బుద్ధికుశలతగల శేఖరం కాలేజీలోనే గాక ఇవతల సాంఘికంగా కూడా మంచిపేరు తెచ్చుకున్నాడు. అమూల్య ఏదో పెళ్ళిలో దూరంనుంచి చూసింది శేఖరంని. ఆ తర్వాత అనుకోకుండా వెంట వెంట ఒకసారి పుట్టినరోజు పార్టీకి, మరోసారి ఏదో పార్టీకి అలా కలుసుకున్నారు. ఆఖరికి బాగా పరిచయం ఏర్పడింది. అనుకుని చెప్పుకోవాల్సింది మహాబలిపురం ఎక్స్‌కర్షన్, దానితర్వాత శేఖరం కోరికమీద పక్షితీర్థం చూడటానికి వంటరిగానే శేఖరంతో వచ్చింది అమూల్య. ఆ పైన సినిమాలకి, బీచ్‌కి తరచుగా కలిసివెళ్ళేవాళ్ళు. అమూల్యకి

తనంటే యిష్టం. తనకి అమూల్యంటే యిష్టం. ఇష్టం కాదా మరి! ఎంత ఇష్టంలేకపోతే యింత ద్వేషం పుడుతుంది? పెళ్లి చేసుకోమని అడిగాడు-ఒప్పుకుంది-చాలా సహజంగా జరిగిపోయింది. అంతా చాలా అద్భుతమైన జంట, ఇలాంటివి చాలా అరుదు అని మెచ్చుకున్నారు. తండ్రికి అంత యిష్టంలేక పోయినా గట్టిగా కాదనలేదు. అసలే ఆయన గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. యెక్కువ రోజులు బ్రతకబోవటంలేదని విస్పష్టంగా తెలుసుకున్న ఆయన యీ కాస్తలో కొడుకుని బాధపెట్టటం ఇష్టంలేక సరేనన్నాడు. ఆర్నెల్లు బాగానే గడిచిపోయినాయి. పెళ్లికాకముందు తనకు కన్పించిన అమూల్యలో తను చూసినవి చాలా తాత్కాలికమైనవని శేఖరానికి అర్థంకాసాగింది. కొంతమంది అంతే. నలుగురిలో ఉన్నప్పుడు ఓ రకంగా, ఒంటరిగా ఉన్నప్పుడు ఓ రకంగా ఉంటారు. డబ్బుమీద అమూల్యకి గల విపరీతమయిన కాంక్షకీ కొన్ని కొన్ని విలువైన విషయాలని అతినిర్లక్ష్యంగా తోసిపారేసే మనస్తత్వానికీ శేఖరానికి చిరాకు రాసాగింది. దానికితోడు తండ్రికి అనారోగ్యం. ఒకే ఒక్కడైన శేఖరం మీద పంచప్రాణాలు పెట్టుకునివున్న ఆయన కొడుకుని క్షణం అవతలకీ, ఇవతలకీ కదలనిచ్చేవాడు కాదు. అది అర్థంచేసుకోలేని అమూల్య శేఖరం తనని కావాలని నిర్లక్ష్యం చేస్తున్నాడని బాధపడి ఇష్టంవచ్చినట్లు మాట్లాడేది. లెక్కలేనట్లు ప్రవర్తించేది. ఎంతో ఉన్నతంగా-ఆదర్శవంతంగా ఉంటుంది అనుకున్న అమూల్య ఇలా మారటం చూసి శేఖరానికేం చెయ్యాలో తోచలేదు. అక్కడికీ ఓపికపట్టి అమూల్యకి అసలు విషయం అర్థంఅయ్యేలా చెయ్యటానికి ప్రయత్నించేవాడు. దాన్ని చాతకానితనంగా తీసుకున్న అమూల్య వాళ్లతో వీళ్లతో "శేఖరం పైకి కన్పించేటటువంటి వ్యక్తి కాదని, అతనిలో రెండురకాలున్నాయని, అతన్ని పెళ్ళిచేసుకోవటంలో తను చాలా బుద్ధితక్కువ పనిచేసి ఫలితం అనుభవిస్తున్నా"నని అనేది. అది ఒక్క శేఖరంతోనే కాదు. స్నేహితులతో, అన్నగార్లతో, తండ్రితో అందరితో చెప్పేది. ఆపైన వాళ్ళూ వీళ్ళూ రావటం, శేఖరానికి ఏదో చెప్పబోవటం, దానితో గొడవలు జరగటం పదిలేసి పుట్టింటికి వెళ్తానని అమూల్య బెదిరించటం, ఈ లోపల తండ్రిపోవటం-శేఖరానికి మతిచెడినంత పనయింది. ఓ పక్క తండ్రి పోయాడనే దిగులు- మరోప్రక్క దాంపత్య జీవితం భగ్నమైందన్న దిగులు అందరికంటే అతితంగా ఆదర్శంగా ఉండాలన్న ప్రయత్నం పోయి అందరికంటే అసహ్యంగా అయిపోయింది అనే ఆవేదన - శేఖరం ఆరోగ్యం పాడయిపోయింది. ఈ మధ్యలో మామగారు, బావమరుదులు

ఉద్యోగంకోసం ప్రయత్నంచెయ్యమనే వేధింపు శేఖరం ప్రతిదానికీ చిరాకుపడ సాగాడు. ఒకరోజు ఏదో డబ్బు విషయంలో పెద్దగొడవ జరిగి అమూల్య తండ్రిదగ్గరికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ పోతూ మెళ్ళో మంగళసూత్రాన్ని తీసి "నువ్వింత చాతకానివాడివని తెలిస్తే చచ్చినా పెళ్ళిచేసుకునేదాన్ని కాను!" అంటూ మొహాన విసిరికొట్టింది. ఆ వెళ్ళిపోవటం ఆఖరని, అప్పటికే అమూల్య మరొకరితో సంబంధం పెట్టుకొని అతడ్ని పెళ్ళిచేసుకోవటానికి సిద్ధంగా ఉందనీ శేఖరానికి తెలియదు. ప్రతిసారిలా అతను అమూల్యను తీసుకురావటానికి మామగారి దగ్గరికి వెళ్ళలేదు. గాయపడ్డ అతని హృదయం కోలుకోవటానికి టైం కావాలంది. శేఖరం తనను తను తమాయించుకుని, నిగ్రహం తెచ్చుకుని ఆమెని యెలా దారికి తీసుకురావాలో నిర్ణయించుకుని మామగారి దగ్గరికి వెళ్ళేసరికి అప్పటికే నాలుగురోజుల క్రితమే ఆమె ప్రసాదుతో కలకత్తా వెళ్ళిపోయింది. వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకునే ప్రయత్నంలో ఉన్నారని అతను కొద్దిరోజులలో అమెరికా వెడుతున్నాడని, ఆమెగూడా వెళుతుందని అనవసరంగా ఆమెకోసం వెర్రిప్రయత్నాలు చెయ్యొద్దని, మంచిగా డైవోర్సు చెయ్యటం ఉభయకుటుంబాల పరువుప్రతిష్ఠలకి మంచిదని ఆయన గట్టిగా అర గంటసేపు లెక్చరిచ్చాడు. కొయ్యబారిపోయిన శేఖరం ఇంటికి తిరిగివచ్చాడు. యెలా చేసుకుంటుంది ప్రసాదుని? తనకి ప్రసాదు తెలుసు. తనలో లేనివి ప్రసాదులో ఏం వున్నాయని అతన్ని చేసుకుంటుంది?

తననికాదని అసలు యెలాచేసుకుంటుందో? కోపంతో, అవమానంతో, నరనరం కాలిపోతున్న శేఖరం ఆమెమీద ప్రతీకారం తీర్చుకోవటానికి ప్రసాదు పెళ్ళి విఫలంకావడానికి ప్రయత్నాలు చెయ్యసాగాడు. దాదాపు ఒక నెల పోయిం తర్వాత అనుకోకుండా ఆమె దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. అందులో, తన మానాన తనని పోనివ్వమని – ఒకవేళ తిరిగివచ్చినా తనతో శేఖరం సుఖపడ లేడనీ – కనీసం ఇలా మంచిగా విడిపోనయినా విడిపోతే మళ్ళీ ఎప్పుడన్నా కలుసుకున్నప్పుడు స్నేహితులుగా పలకరించుకోవచ్చని రాసింది. దానికి శేఖరం జవాబు రాయలేదు. జవాబు రాయలేదని ఆమె ఊరుకోలేదు. వెంట వెంట అతనికి ఉత్తరాలు రాయటం మొదలుపెట్టింది. వాటిల్లో జీవితంపట్ల తనకున్న అభిలాష, కోర్కెలు, అన్నీ వివరిస్తూ రాసేది. ఉత్తరాలు చాలా సహజంగా, న్యాయంగా, ప్లెయిన్‌గా ఉండేవి. వాటిల్లో పేటనీ శేఖరం కాదనలేకపోయేవాడు. ఆఖరి ఉత్తరంలో రాసింది ఆమె: "నీలో నేను మొదట చూసినవి ఇప్పటికీ

ఉన్నాయి. వాటిని నేను ఎక్కడున్నా యే సమయంలోగూడా గౌరవించి అభిమానిస్తాను. కాని నాకు ముఖ్యంగా కావాల్సినవి నీలో లేవు. అవి వున్నాయని నన్ను మోసపుచ్చుకోలేను. ఒకవేళ అలా మోసపుచ్చుకుందామని అనుకుంటే జరిగే ఫలితం నాకు తెలుసు. అందుకే నే నిటువైపు వెళ్ళటంలేదు. నాలో లేనివి నీకు కూడా తెలుసు. నాకు కావాల్సిన విధంగా మారమని నిన్నెలా అడగనో_అలాగే నీకు కావాల్సిన విధంగా నేనూ మారలేను. ఇలాగయితే ప్రపంచంలో ఎన్ని వివాహాలు జయప్రదం అవుతాయి అని నువ్వడిగితే నేను జవాబు చెప్పలేను. మనలో నూటికి తొంభై జీవితాలు త్యాగమనే చక్రంలో ఆకుల్లా తిరిగిపోతున్నాయి. చాలామందికి అసలు జీవితం అంటే యేమిటి? దాన్నెలా అనుభవించాలి అన్న ప్రశ్నలేకుండా బ్రతుకుతున్నారు. అలాంటి వాళ్ళకి చెయ్యెత్తి నమస్కరించవచ్చు. వాళ్ళకే బాధలు ఉండవు. నే నలాటి వాన్ని కాను. నాకు ప్రత్యేకంగా కావాల్సినవి కొన్ని ఉన్నాయి. అవి పోతే పోయినాయి. కానీ వాటికోసం నేను ప్రయత్నం చెయ్యకుండా ఉండలేను. ప్రసాదుని నేను చేసుకున్నానంటే అతనేదో మహా పొడిచేశాడని_ధీరుడని_అందరికి అతీతుడని గాదు. ఒక విధంగాఅతను నీకంటె చాలా తక్కువే. కానీ నీలా అతను జీవితాన్ని నా యిష్టం వచ్చినట్లు అనుభవించడానికి అడ్డురాడు. నేనంటే పిచ్చి యిష్టం. అంతవరకే తెలుసు అతనికి. అదెంత హాయి. నీలా అతడు తన ప్రేమతో బంధించాలనిగాని_ఆ ప్రవాహంలో ముంచాలని కాని చూడడు. శుక్రవారం మేం యిద్దరం న్యూయార్క్ బయలుదేరుతున్నాం. నాకు తెలియని లోకాలకు యెగరటానికి ప్రసాదు నాకు రెక్కలు యిస్తున్నాడు. అంతే! అక్కడనుంచి తిరిగివస్తానని నమ్మకంలేదు. జీవితంలో మన పరిచయానికి గతమేగాని భవిష్యత్ లేకపోవచ్చు. నన్ను క్షమించు. నాకు తెలుసు నువ్వు కోరుతున్న విధంగా నే నుండలేకపోయానని. అందుకు నేను దిగులుపడడం లేదు. సెలవు" చాలా వివరంగా రాసిన ఆ ఉత్తరాన్ని చాలాకాలం దగ్గర పెట్టుకున్నాడు శేఖరం. ఆమె అమెరికా వెళ్ళిపోయింది. తనకు ఉద్యోగం దొరికింది. ఆంధ్రప్రదేశ్ రాకముందే హైద్రాబాదు వచ్చేశాడు. తన సంస్కృతి తన స్వజనానికి సంబంధంలేని నగరం. అనవసరంగా సానుభూతి చూపేవాళ్ళు కాని జీవితంలో ఓడిపోయానని వెక్కిరించేవాళ్ళకాని, అమూల్యమందు చాత కాని వాడనైనానని గుర్తుచేసేవాళ్ళుగాని లేరు. మనసు, మనసుతోపాటు జీవిత విధానాన్ని గూడా మార్చుకుని హైద్రాబాద్‌లో సెటిల్అయ్యాడు శేఖరం.

ఇప్పుడెవ్వరికీ అతనికి పెళ్ళయినట్లు తెలియదు. మళ్ళీ పెళ్ళిచేసుకోమని సలహా యిస్తున్న మిత్రుల్ని తిరస్కరించేవాడు. ఇన్ని విధాలా ఉన్న అతనికి ఆడవాళ్ళంటే విముఖత్వం యెందుకో యెవ్వరికీ అర్థంఅయేదికాదు. మళ్ళీ ఆడవాళ్ళతో అతని ప్రవర్తన చాలా మృదువుగా ఆకర్షణీయంగా ఉండేది. మళ్ళీ పెళ్ళిచేసుకోగలనని శేఖరం కల్లోకూడా అనుకోలేదు.

తర్వాత చాలాకాలానికి వోసారి ఓ స్నేహితుడు పెళ్ళిచూపులకు తోడు రమ్మనమని బందరు దగ్గర ఓ పల్లెటూరికి తీసికెళ్ళాడు. ఆ పెళ్ళికూతురే వాసంతి. చాలా శ్రోత్రియ కుటుంబంలో పుట్టిన వాసంతికి పుట్టిన ఊరు తప్ప ప్రపంచం తెలియదు. పుట్టుకతో వచ్చిన విజ్ఞానం తప్ప పుస్తకాల ప్రభావం లేదు. అడవిమల్లెలా వున్న వాసంతి అమాయకపు మొహంతో పసిపిల్ల మనస్తత్వాన్ని ప్రతిబింబింపచేసే పెద్ద పెద్ద కళ్ళతో తలయెత్తలేని సిగ్గుతో శేఖరాన్ని మొదటిచూపులోనే ఆకర్షించింది. "పేరేమిటని" అడుగుతున్న శేఖరమే పెళ్ళికొడుకనుకున్న వాసంతి కళ్ళల్లో మెరుపులు కురిపిస్తూ "వాసంతి" అంది. ఆ అమ్మాయి యేం చదువుకోలేదని, పైనుంచి వాళ్ళు తన హోదాకి తగినవారు కాదని ఆ సంబంధాన్ని తోసిపారేశాడు శేఖరంమిత్రుడు. తర్వాత తనే స్వయంగా యీ సంగతి తెలియపరుస్తూ తనకున్నవి తెలియపరుస్తూ మీకేమీ అభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని నేను చేసుకుంటానని ఉత్తరం రాశాడు.

తిరుగుటపాలో ఉత్తరానికి పిల్లతండ్రి పరుగెత్తుకొచ్చాడు. తన మొదటి వివాహాన్ని గురించి స్థూలంగా వివరిస్తూ ఆ అమ్మాయి పోయిందనీ, మళ్ళీ తనకు పెళ్ళి చేసుకోవాలనిపించలేదనీ యింతకాలానికి వాసంతి తన మనసులో ఆ కోర్కెను కదిపిందనీ చెప్పాడు. స్థితిగతులు తెలుసుకున్న ఆయన మొహం విప్పారింది. పెళ్ళిచూపులకు రావటం కేవలం అమ్మాయి అదృష్టం అని పదే పదే చెప్పి కళ్ళలో నీళ్ళు తిరిగినంత సంతోషం పొంది, ఆయన తిరుగుమొహం పట్టాడు. మరుసటి నెలలో వాసంతితో శేఖరం వివాహం జరిగిపోయింది.

వాసంతి రాకతో శేఖరం జీవితమే మారిపోయింది. చాలాకాలంనుంచీ ఆధారంలేక అడ్డదిడ్డంగా పాకుతున్న మనసుకి పెద్ద ఆధారం దొరికినట్లయింది. కానీ యిదంతా వాసంతికి తెలియదు. సంభాషణలో మూడొంతులు వాసంతివే ఉంటాయి. ఒకవంతులో సగం శేఖరం నవ్వుతూ ఉంటాడు. జీవిత తటాకంలో ప్రశాంతత పొందిన నీరు తేటగా తేరుకోసాగింది. పాత అనుభవాలు అడుక్కి వెళ్ళిపోయాయి. పూర్తిగా ధైర్యం కలిగింది. హమ్మయ్య అనుకుంటున్న సమ

యంలో మళ్ళీ రాయి విసరబడింది. అమూల్య వచ్చింది. ఈసారి నీళ్ళు మలినం అయితే తేర్చటం తనకి సాధ్యంగాదు. అందుకే శేఖరం భయపడుతున్నాడు. అతన్ని మరీ మరీ బాధిస్తున్న విషయం తనమీద అమూల్య ప్రభావం పూర్తిగా పోయిందనుకున్నాడు. కాని అదేంలేదు. తాత్కాలికంగా పక్కకు ఒరిగి ఒదిగి వుంది. సమయం చిక్కగానే మళ్ళీ ఉరుకుతోంది మీదకి. అదీ బాధిస్తున్న విషయం.

చాలాసేపట్నుంచీ యేవేవో చెప్తున్నాడు శేఖరం. అతని గుండెలమీద అలాగే పడుకొని వింటోంది వాసంతి. చెవిదగ్గర టకటకమని గడియారంలా కొట్టుకుంటున్న అతని గుండె ఒకోసారి బాధగా, ఒకోసారి కోపంగా ఇంకోసారి అతిబాధగా రకరకాలుగా మారుతున్న కంఠస్వరం గదిలో బెడ్‌లాంప్ నుంచి లేతనీలంగా వస్తున్న కాంతి అదోరకంగా వుండి గదిలో వస్తువుల్ని తమాషాగా చేసి చూపుతోంది. అవన్నీ కలిపి వాసంతికి ఇదంతా అబద్ధం, మాయ- శేఖరానికి వెనక ఇంత బాధ ఉండటం ఏమిటి? పచ్చి అబద్ధం అనిపించింది. నిజంగానే కథలా వుంది.

"నిజం వాసూ! నా కిప్పుడు తేలికనిపిస్తోంది. నిజంగా నేనింత బాధపడ వలసిందిగాని, భయపడవలసిందిగాని లేదేమో కదూ? ఏమిటి నిద్రపోతున్నావా? ఒక్కమాటగూడా మాట్లాడలేదు ఇంతసేపట్నుంచీ.... చెప్పు" భుజాలు పట్టి లేవదీస్తూ అన్నాడు శేఖరం.

"లేదు, లేదు. మీరు చెపుతున్న కథ వింటున్నాను" నీరసంగా మళ్ళీ అతని గుండెలమీదకి తలవాలుస్తూ అంది వాసంతి. శేఖరం మాట్లాడలేదు. తను తొందరపడ్డాడేమో? వాసంతికి అర్థం అవుతుందా? చెప్పకుండా వుంటే బాగుం డేదేమో? అతని చేతులు వాసంతి జుట్టును- బుగ్గల్ని ఆప్యాయంగా నిమురుతూ ఉండిపోయాయి. మనసు హఠాత్తుగా, వేగంగా ఆలోచించసాగింది. లేదు, లేదు. తనమీద అమూల్య ప్రభావానికి బలమే లేదు. వాసంతి తన ప్రక్కనుంది. వాసంతితో జీవితం ముడిపడిపోయివుంది. అమూల్య ఒకటీ!

అమూల్య వచ్చి యెదురుగా కూర్చున్నా తను చలించడు. అవును, నిజం. అమూల్యకి తనంటే ఏమిటో యింకా బాగా తెలియాలి. వాసంతితో కలిసి ప్రస్తుతం తను అనుభవిస్తున్న జీవితాన్ని చూసి ఈర్ష్యపడాలి. తనని గురించి ఆలోచించేందుకు ఒక్క సెకనుకూడా ఖాళీలేకుండా వాసంతి ఆక్రమించు కుందని తెలియాలి. తను అనవసరంగా ఖంగారుపడుతున్నాడు. ఇది మంచికే

వచ్చింది. ఒకవేళ యెప్పటికీ అమూల్య యిక్కడే వుండిపోవటం తటస్థిస్తే తనీ వూరునుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోతాడు. ట్రాన్స్‌ఫర్ కుదరదు, చెయ్యము అంటే నా వాసంతిని తీసుకుని ఇంకెక్కడికైనా వెళ్ళి పోతాను. అంతేకాని, అమూల్యని గడప తొక్కనివ్వను. ఆలోచిస్తున్న ంతను పరధ్యానంగా వున్న వాసంతిని మరింత గుండెలదగ్గరికి లాక్కున్నాడు.

"నే నొకటి అడగనా?" చాలా సేపటికి మొదటిసారిగా మాట్లాడుతూ నీరసంగా అంది వాసంతి.

"ఏమిటది చెప్పు? ఇహనుంచి నీకు తెలియని విషయమంటూ లేదు."

"ఆమె తిరిగిరావటం మీకేమన్నా అన్పిస్తోందా?"

"అంటే..?" అర్థంకానట్లు వాసంతి కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"అంటే యేంలేదు. నన్ను పెళ్ళిచేసుకోవటంలో త్వరపడ్డా రనిపిస్తోండ మీకు? చెప్పండి. నేను పేదగా, పరాయిగా అన్పించటం లేదుగదూ! ఇన్నాళ్ళ మనజీవితం ఏంకాకుండా పోదుగా మీకు?"

"ఏమిటి నువ్వనేది?"

"మీరు పడేబాధ చూస్తూంటే ఆమె మీద అభిమానం వున్నట్లే వుంది. ఆవిడంటే లెక్కలేనట్టే వుంటే మీరసలు బాధపడనేపడరు."

"నీ మోహం, అదేంకాదు. ప్రపంచంలో నాకున్నది ఒక్కరే_అది వాసంతి! ఆ వాసంతికీ, నాకూ మధ్య అడ్డుగా ఏదీరాదు. వాసంతి తనంత తాను నన్ను వక్కర్లేదంటే తప్ప. నువ్వు చాలా అలిసిపోయావు. ఇహ పడుకో. నీ కసలిది చెప్పి ఉండకూడదు. నేనొక మూర్ఖుణ్ని. చూడు, నీ మొహంలో ఇందాకటి చిరునవ్వు లేదు. కళ్ళుకూడా అనుమానంగా భయంగా వున్నాయి. నువ్వు నన్ను నమ్మలేకపోతే నేనేం చెయ్యలేను వాసంతీ! ఆవిడ నాకేంకాదు. ప్రపంచంలో వున్న లక్షమందిలో ఆవిడ ఒకత్తి. నువ్వు అనవసరమైన ఆలోచనతో మనసు పాడుచేసుకోనని నాకు మాట యివ్వాలి. నీ ఆరోగ్యం అసలే సరిగ్గా లేదు. ఈ రెండురోజుల్లో చాలా తీసినట్లు కన్పిస్తున్నావు. డాక్టర్ సుశీల వచ్చిందా? ఏమంది?" వాసంతి చేతుల్ని తన బుగ్గలకి, కళ్ళకి ఆన్చుకుంటూ అడిగాడు శేఖరం. ఆఖరిమాటకి వాసంతి మొహంలోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. "ఎలా చెప్పటం అతనికి? ఇప్పుడా... యిలాగా. ఉహూ, యిప్పుడు కాదు" అనుకుంటూ "రేపు మీరు ఫోన్‌చేసి అడగండి!" అంది.

"అదేం! నీకు చెప్పలేవూ?"

"చెప్పలేదు." అంది వాసంతి నిర్లిప్తంగా.

తెల్లవారుఝామయింది. చల్లగాలి కిటికీలోంచి దూసుకొస్తోంది. బాగా అలసిపోయిన యిద్దరూ నిద్రకు ప్రయత్నం చేయసాగారు.

మర్నాడు వాసంతి లేచేసరికి బాగా బారెడు పొద్దెక్కింది. తెల్లగా బాగా మెరుస్తున్న యెండ కిటికీ చువ్వల్ని దూసుకొచ్చి లోపల డ్రాయరు, కుర్చీ, పుస్తకాలు వాటిమీద పడ్తోంది. మంచంమీద బద్ధకంగా బరువుగా కళ్ళు తెరిచిన వాసంతికి అంతా కలలో యేదో పెద్దగొడవ జరిగి తను స్పృహతప్పిపోయినట్లు అన్పించింది. క్షణంసేపు రాత్రి జరిగింది. శేఖరం చెప్పింది అంతా వట్టి కలేననిపించింది. ప్రక్కకు తిరిగి చూసింది. కానీ శేఖరం లేడు. వళ్ళంతా బరువుగా బాధగా వుంది. జ్వరం తగిలిందని థర్మామీటర్ చూపింది.

వాసంతి లేచి యివతలకు వచ్చేసరికి శేఖరం హాల్లో కూర్చుని కాఫీ తాగుతూ, పేపరు చూసుకుంటున్నాడు. మామూలు ప్రకారం అతని స్నానం అయిపోయింది. వాసంతి మెల్లగావచ్చి శేఖరం కుర్చీప్రక్కన నిలబడింది. "మెలకువ వచ్చిందా? కళ్ళు చాలా యెర్రగా ఉన్నాయి. ఇంకొంచెంసేపు పడుకోకపోయావా? నిద్ర చాల్లేదులా ఉందికదూ?" నవ్వుతూ చెయ్యి తీసుకుని ఏదో చెప్పబోతున్నాడు శేఖరం. హఠాత్తుగా వాసంతి వంగి మోకాళ్ళమీద కూర్చుని అతని చేతుల్లో మోహందాచుకుని యేడుస్తూ "రాత్రి చెప్పిందంతా అబద్ధం కదూ! అబద్ధం అని చెప్పండి నాకు! నాకేదో భయం వేస్తోంది" అంది.

శేఖరం క్షణంసేపు మాట్లాడలేదు. తర్వాత చాలా తగ్గుస్థాయిలో చాలా నిశ్చలంగా, నెమ్మదిగా "అవును అంతా అబద్ధమే- నీకు కల్పించి చెప్పానులే. రాజావాళ్ళు వస్తారు. వెళ్ళి మొహం కడుక్కోనిరా- ఇదేమిటీ వేడిగా ఉందేం వళ్ళు. జ్వరం వచ్చిందా!" హఠాత్తుగా, ఆదుర్దాగా చేయిపట్టి లేవదీస్తూ అన్నాడు.

వాసంతికి జ్వరం బాగానే వచ్చింది. డాక్టర్ సుశీలకి ఫోన్‌చేశాడు. ఆవిడ డ్యూటీమీద ఉంది-సాయంత్రం కాని రాలేనని యెవరితోనో చెప్పించింది. ఆ రోజు శేఖరం ఆఫీసు మానేశాడు. వాసంతి ప్రక్కనే కూర్చుని చాలా మామూలుగా అవీయివీచెప్తూ తమాషాలుచెప్పి నవ్విస్తూ కూర్చున్నాడు. వాసంతిని విడిచి కనీసం ముందు హాల్లోకి కూడా వెళ్ళలేదు. ఇష్టం లేకపోయినా శేఖరం కోసం చారూ అన్నం తింది వాసంతి.

బాగా పన్నెండయింది. తన మంచం ప్రక్కన వాలుకుర్చీలో కూర్చొని యేదో పుస్తకం తిరగవేస్తున్న శేఖరాన్ని వున్నట్లుండి అడిగింది- "ఆవిడ

సుకన్యాదేవికి తప్ప ఇక్కడ యింకెవ్వరికీ తెలియదా ?" అని. "తెలియదు. నువ్వింక ఆ ప్రసంగం యెత్తొద్దు" గంభీరంగా అన్నాడు శేఖరం, పుస్తకం తిరగవేస్తూ.

వాసంతి ఆపైన మాట్లాడలేదు. శీతాకాలపు మధ్యాహ్నం పన్నెండుగంటలు దాట్తూండగానే ఎండ తిరిగిపోతోంది. సన్నగా వీస్తున్న గాలికి గుమ్మానికున్న కర్టెన్ కదులుతోంది. గదిలో గోడలమీద పాకిన వాజర్‌ప్లాంట్ ఆకుల్ని కిటికీలోంచి వచ్చి పిచ్చుక ఒకటి పొడిచి తుంపాలని ప్రయత్నం చేస్తోంది. మధ్యాహ్నం చాలా దిగులుగా ఏదో పోగొట్టుకున్న దానిలా వుంది. మోచేయి దిండుమీద ఆన్చిపడుకుని చేతిలో పుస్తకాన్ని తిరిగేస్తోంది వాసంతి. ఏదో చప్పున అయిపోయి జరగవలసిందేదో జరిగిపోతే బాగుండుననిపిస్తోంది. నాటకంలో సీను సీనుకి మధ్య ఇంటర్వ్యూల్‌లా వుంది. ఇంతలో ఫోన్ మోగింది. "సుశీలా"అంటూ శేఖరం లేచి వెళ్ళి రిసీవర్ తీశాడు. అంతవరకూ పుస్తకం తిరిగేస్తున్న వాసంతి కళ్ళెత్తి అతని మొహంలో మారబోయే భావాలకోసం పరీక్షగా చూస్తోంది. సుశీల-చెప్పబోయేదేమిటో వాసంతికి తెలుసు. కానీ యిప్పుడీ సమయంలో—ఇలా-సుశీల చెప్పకుండా వుంటే బాగుండు. అసలు యింకెవరయినా అయితే బాగుండు ననిపిస్తోంది.

"హలో !" అన్నాడు శేఖరం రిసీవర్ తీసుకుని.

".... ...." అవతలనుంచి ఏ స్వరం విన్పించిందో ఏమని విన్పించిందో తెలియదు. కానీ హఠాత్తుగా శేఖరం మొహంలో గబగబా రంగులు మారాయి. కంఠస్వరం కూడా మారింది. ఫోన్ వైర్‌ని చేత్తో సాప్‌చేస్తూ చాలా గంభీరంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. "ఇందులో క్షమాపణ యేమీ లేదండీ ! రాత్రి నా ప్రవర్తనకి నేనే చెప్పుకోవాలి. ఏదయినా ముందుగా కొంచెం ఏ మాత్రం తెలిసినా అలాటి సంఘటన జరిగేది కాదు. అందులో మీకు తెలియని రహస్యం ఏంలేదు."

".... ... " మళ్ళా అవతలనుంచి ఏదో విన్పించింది.

"అబ్బెబ్బె ! మీ మీద కోపం యెందుకు ! యేమిటీ ? మాట్లాడాలంటోందా? క్షమించండి ! మా యిద్దరికీ గతమే తప్ప భవిష్యత్తు లేదన్నానని చెప్పండి. యెప్పుడు ఎలాంటి పరిస్థితుల్లోనూ మా మధ్య మాట్లాడవలసిన మాటలేం లేవు. ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పండి. ప్రసాద్ కిక్కడికి ట్రాన్స్‌ఫర్ అయిందా !.... ఓహో ! అలాగా, నేను ఒక వేళ ట్రాన్స్‌ఫర్ అయిందేమో

అనుకుంటున్నాను. ఇందులో మీ దగ్గర దాచవలసిందేమీలేదు. ఒకవేళ వాళ్ళు ఉద్యోగరీత్యా ఇక్కడికి వచ్చేటట్లయితే నేను రేపే ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోదాం అనుకుంటున్నాను. మేం ఇద్దరం ఒక ఊళ్ళో వుంటూ తెలియకుండా ఉండటం అసంభవం."

"…. …. …."

"ప్రస్తుతం వాసంతికి తెలియని విషయం అంటూ ఏమీ లేదండీ! నిన్న రాత్రి వరకూ తెలియదు. కానీ మీ ఇంటిదగ్గర్నుంచి వచ్చింతర్వాత అంతా చెప్పేశాను! ఇప్పుడు నాకు చాలా తేలికగా వుంది." నిట్టూర్పు విడుస్తూ అన్నాడు శేఖరం. మంచంమీద కూర్చున్న వాసంతి రెప్పవాల్చటం గూడా మర్చిపోయి తదేకంగా భర్తని గమనిస్తోంది.

"లేదండీ! మీరు గట్టిగా చెప్పండి 'మాకు కలుసుకోవాల్సిందిగాని మాట్లాడుకోవాల్సిందిగాని ఏమీలేదని.' నేను ఉంటాను…. అవును: ఆఫీసుకు వెళ్ళలేదు. వాసంతికి ఒంట్లో బాగాలేదు" ఫోన్ చప్పుడుచేస్తూ పెట్టేశాడు శేఖరం. అంత వరకూ శేఖరం వంక పరీక్షగా చూస్తూన్న వాసంతి చప్పున తల తిప్పుకుని కిటికీలోంచి బైటకు చూస్తున్నదానిలా కూర్చుండిపోయింది.

తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్న శేఖరం చాలాసేపటివరకూ ఏం మాట్లాడ లేదు. పుస్తకం తిరగేస్తూ ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు! వాసంతిగూడా ఏం మాట్లాడలేదు! నాలుగు దాటిపోయింది. రాజు కాఫీ తెచ్చియిస్తుండగా శేఖరం అన్నాడు: "ఇదుగో చూడు రాజూ! చప్పున ఏదయినా టిఫిన్ చెయ్యి. లేకపోతే బజారుకుపోయి ఏవైనా పళ్ళు తీసుకురా! కాఫీచేసి ప్లాస్కులో పోసి వుంచు-మేం అలా డ్రైవ్‌కి పోతున్నాం, తిరిగి వచ్చేసరికి కొంత ఆలస్యం అవుతుందేమో ?" రాజు సరేనని తలూపి వెళ్ళిపోయాడు వాసంతివైపు చూడకుండానే. కాఫీ తాగుతూ "నువ్వు త్వరగా తయారుకావాలి వసూ! ఇలా ఇంట్లో కూర్చోటం నాకు బాగాలేదు. అలా హిమాయత్ సాగర్ పోదాం- రాజుని క్యారియర్‌తో భోజనంకూడా పెట్టమంటాను కారులో. ఈ రాత్రికి తిరిగి రావద్దు. నువ్వు కొంచెం మొహంకడుక్కుని బట్టలేసుకో——" శేఖరం మాటలు సాంతం పూర్తికాకముందే టెలిఫోన్ మోగింది. కాఫీ తాగుతున్న శేఖరం ప్రశ్నార్థకంగా ఫోన్‌వైపు చూశాడు. కాఫీ తాగటం మానేసిన వాసంతి శేఖరం మొహంలోకి చూడసాగింది.

కాఫీ తాగడం పూర్తిచేసి నిదానంగా లేచివెళ్ళి రిసీవర్ తీసుకున్నాడు "హల్లో" అంటూ

వాసంతి చేతిలోకప్పు అలాగే పట్టుకుని భర్తమొహంలోకి మళ్ళీ రెప్పవాల్చకుండా చూడసాగింది.

"ఎవరు ?" కొంచెం కటువుగానే అడిగాడు శేఖరం.

"..........."

"ఓ! డాక్టర్ సుశీలా! నమస్తే నమస్తే! అయింవా డ్యూటీ ?" శేఖరం మొహం ప్రసన్నమయింది. అంతవరకూ చూస్తున్న వాసంతి చప్పున దృష్టి అంతా కాఫీమీదకు మరల్చుకుని జాగ్రత్తగా తాగుతున్నట్లు తాగసాగింది 'ఇప్పుడా—ఇప్పుడా' వాసంతి గుండెలు కొట్టుకుంటున్నాయి.

"ఏమిటీ బహుమతా ? బహుమతేమిటీ ? అహఁ! వాసంతి నాకేం చెప్పలేదే" వెనక్కి తిరిగి వాసంతివైపు చూస్తూ అన్నాడు. అప్పటికే కాఫీ తాగడం పూర్తి చేసిన వాసంతి కప్పు వంగి క్రిందనున్న స్టూలుమీద పెట్టేసి పుస్తకంలో తల దూర్చి బొమ్మలు చూడసాగింది.

"అడగమంటారా, ఆగండి అయితే" మౌత్‌పీస్‌ని అరచేత్తో మూసి "సుశీల తనకి బహుమతి కావాలంటోందేమిటి ? వసూ! దేనికి ?" అన్నాడు.

"యేమో నాకు తెలియదు. ఆవిడనే అడగండి" రక్తం అంతా ఒక్కసారి మొహంలోకి వచ్చేసినట్లు యెర్రబడిన మొహాన్ని మరింత దించేసుకుంది వాసంతి.

"మిమ్మల్ని అడగమంటోంది" మళ్ళీ ఫోన్‌లో మాట్లాడుతూ అన్నాడు శేఖరం.

"ఆఁ! ఏమిటీ ? సరిగా వినపడటంలేదు. ఊఁ! యేమిటి మీరనేది? నిజం సుశీల చెపుతోంది నిజమేనా వసూ!" వెనక్కి తిరిగి అడిగాడు శేఖరం. పుస్తకంలోకి మొహం దించేసుకుంది జవాబుగా వాసంతి.

"థాంక్స్ సుశీలా! మీకు స్పెషల్ పార్టీ ఇస్తానని ప్రామిస్ చేస్తున్నాను నేను ఉంటాను" ఫోన్ పెట్టేశాడు అతను.

ఫోన్ పెట్టేసిన శేఖరం వెంటనే పరుగెత్తుకుని దగ్గరకు వచ్చెయ్యలేదు క్షణంసేపు అలాగే నిలబడిపోయి భార్యను చూసి ఆ తర్వాత నెమ్మదిగా వచ్చి మంచంమీద ప్రక్కగా కూర్చున్నాడు.

"నిజమా వసూ! నాకు ఇంతవరకూ చెప్పలేదేం ?" తన భుజంచుట్టూ చెయ్యి వేసి అడుగుతున్న శేఖరం మాటలు వింటూనే వాసంతి చప్పున పుస్తకం వదిలి అతని వళ్ళో తలదాచుకుంటూ "రాగానే చెప్పాలనుకున్నాను కానీ టైం దొరకలేదు. అందులో యీ గొడవలో అసలెలా చెప్పాలో తెలియలేదు."

"నాకోసం నువ్వింత మంచివార్త దాచుకుని ఉంటే నేను నిన్నెంతో బాధించాను కదూ! క్షమించు వాసంతీ?" యేదో అనబోతున్న శేఖరాన్ని చేత్తో వారిస్తూ "ముందు నాకిది చెప్పండి మీ కెలా అనిపిస్తుంది? సంతోషంగా లేదూ?"

"దానికి జవాబు కావాలంటే నువ్వు తలెత్తి కళ్ళుతెరిచి నా మొహంలోకి చూడాలి" అదోరకంగా మారిపోయిన కంఠస్వరంతో అంటున్న భర్తకేసి తల తిప్పి కళ్ళుతెరిచి చూడబోతున్న వాసంతి చెంపలమీద అప్పటికే నిండిపోయి జారిన కన్నీటి బిందువులు పడ్డాయి. వాటిని కొనగోటితో తుడుస్తూ శేఖరం "ఇంతకంటే మంచివార్త యింకేముంటుంది నాకు? మనలో చాలా సంసారాలు నూటికి దాదాపు తొంభై పిల్లల మూలంగానే నిలుస్తున్నాయి అంటే అతిశయోక్తి కాదు సుమా! మన సంసారం అలాటిది కాకపోయినా..." వంగి వాసంతి నుదురుమీద ముద్దుపెట్టుకుంటూ అన్నాడు.

బాగా సాయంత్రం అయిపోయింది. శేఖరం, వాసంతి తయారయినారు. గేరేజ్‌లోనుంచి కారుని బయటకు తీసి వరండా ముందుకు తేవటానికి వెళ్ళాడు శేఖరం. హాల్లో అతనికోసం చూస్తూ నిలబడిన వాసంతికి ఫ్లాస్క్, పళ్ళు-భోజనం క్యారియర్ కారులో పెట్టి తిరిగివస్తున్న రాజు "సుకన్యాదేవి నౌకరువచ్చి ఇచ్చి వెళ్ళాడంటూ ఒక కవరు యిచ్చి వెళ్ళాడు. కవరు అంటించి వుంది. పైన శేఖరంపేరు ఉంది. ఇంతలో వాకిట్లోంచి శేఖరం పిలుపు విన్పించింది. వచ్చి కారులో ప్రక్కన కూర్చుంటూ రాజు ఇచ్చిన కవరు ఇచ్చింది- "ఏమిటిది?" కారు స్టార్టుచేయబోతున్న శేఖరం ఆగి కవరు చించాడు. అందులో ఉత్తరం" ఉంది. చదువుకున్న శేఖరం పూర్తిచేసి చదవమన్నట్లుగా వాసంతి చేతికిచ్చాడు. "ఎవరు రాసింది?" ఉత్తరం తీసుకుని చూచింది వాసంతి. అది అమూల్య స్వయంగా రాసిన ఉత్తరం. అందులో ఇలా వుంది——

"శేఖరం!

నిన్ను వదిలిపెట్టి వెడుతున్నప్పుడు నేను చాలా అదృష్టవంతురాలినని, నిన్ను గెల్చానని అనుకున్నాను. కానీ నేను వెళ్తోంది అదృష్టపు శిఖరాలు అందుకోవటానికి కాదని—అఘాతపు లోయల్లో నామరూపాలు లేకుండా జారిపోవటానికని నాకేం తెలుసు. నువ్వు ఎప్పుడూ అదృష్టవంతుడివే. మొదట నన్ను పెళ్ళిచేసుకున్నప్పుడు లోకం నిన్ను అదృష్టవంతుడవని అంది. నేను విడిచి వెళ్ళిపోయినప్పుడూ అంది. యిప్పుడూ అంటోంది. ఈ కొద్ది సంవత్సరాల్లో నేను మానసికంగా మారాను. కొన్ని ఊహల తాలూకూ విలువలుగూడా అర్థమయినాయి.

అనుభవం చాలా పాఠాలు నేర్పింది. నిన్ను విడిచి పెట్టినప్పుడు వెళ్ళిన అమూల్యను కాను నేను." అందుకే యిప్పుడు హఠాత్తుగా వెళుతున్నాను. నువ్వు హైద్రాబాదులో ఉన్నావని తెలిస్తే నేనీ ఛాయలకికూడా వచ్చేదాన్ని కాదు. తెలియక పాత జీవితాన్ని జ్ఞప్తిచేసుకొని కాసేపు కులాసాగా గడుపుదామని సుకన్యాదేవి యింటికి వెళ్ళాను. సరిగ్గా అప్పుడే పుట్టినరోజు జరగటం, మీరు రావటం నా దురదృష్టం. రాత్రి చాలా బాధపడ్డాను. ముఖ్యంగా వాసంతి మొహం నన్ను నిద్రపోనివ్వలేదు. నాకు ప్రస్తుతం లేనివి—నేను అజ్ఞానంలో కాలదన్నుకున్నవి యిప్పుడు వాసంతికి ఉన్నాయి. ఒక్కసారి నీతో మాట్లాడా లని ప్రయత్నించి సుకన్యాదేవి చేత ఫోన్ చేయించాను. గతం తప్ప భవిష్యత్తు లేదన్న నా మాటని నాకు తిప్పి చెప్పావు. నీకేం భయమక్కరలేదు. నువ్వే ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నం చెయ్యొద్దు. నేనే ఈరోజు సాయంత్రం వెళ్ళిపోతు న్నాను. మళ్ళీ యెప్పటికీ కనబడనని వాగ్దానం చేస్తూ—

అమూల్య."

అమూల్య ఉత్తరాన్ని ఒకటికి రెండుసార్లు చదివింది వాసంతి. అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అవి అమూల్య వెళ్ళిపోతోంది కదా అనే అనుభూ తితో కాదు-యేదో పెద్ద ప్రమాదం జరగబోయి ఆగిపోయిందనే సంతృప్తితో, సంతోషంతో. ఎప్పటిలా తనూ శేఖరం మిగిలిపోయారు కదా అనే ధైర్యంతో. చేత్తో ఉత్తరాన్ని మడిచేసి బయటకు చూసింది వాసంతి. కారు హిమయత్ సాగరువైపు రివ్వున దూసుకుపోతోంది. ప్రక్కనుంచి బంజారహిల్స్ వెనక్కి భయంతో తప్పుకుంటున్నాయి.

రోడ్డుని తదేకంగా చూస్తూ ఫాస్టుగా డ్రైవ్‌చేస్తున్న శేఖరం ఒకచేత్తో డ్రైవ్ చేస్తూ రెండోచెయ్యి జాపి వాసంతిని దగ్గరకు తీసుకున్నాడు. అతని కళ్ళల్లో కూడా నీళ్ళు తిరుగుతున్నాయని, అవి నిగ్రహించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడని వాసంతికి తెలియదు. ప్రక్కకు తిరిగి భర్త భుజంమీద తలదాచు కుంటూ "నిన్న యీ టైమ్‌కి, ఈరోజు యీ టైమ్‌కి ఎంత అనుభవం పొందాను నేను. ఒక్క ఇరవై నాలుగ్గంటలలో యెంత మారానో!" అంది.

"ఒక్కసారి అంతే వసూ! ఇరవై నాలుగు గంటలే అక్కర్లేదు. యిరవై నాలుగు సెకన్లు చాలు మారటానికి" నెమ్మదిగా అన్నాడు శేఖరం.

వచ్చే సంచికలో

నాకు నచ్చిన నా కథ

తాళ్లూరు నాగేశ్వరరావు